# త్రివేణి

నిత్యానందం తామరాకుమీది నీటిబొట్టు ఏదీ మనసుకి పట్టించుకోడు. దేనినీ అంటకుండా జారిపోతూ వుంటాడు. ఎప్పుడూ బాధపడ్డట్లే కనిపించడు. అతను కంట తడిపెట్టుకోవటం అంతర్యామికూడా చూసివుండడు. చాలామందికి అతనికి హృదయమంటూ వుందా అనిపిస్తుంది. కొందరికి అతను కపటనాటకం ఆడుతున్నట్లుగా కనిపిస్తాడు. కొందరికి అతను తొణకని నిండుకుండగా కనిపిస్తాడు. మొత్తంమీద అతని మనసులో ఏముందో తెలుసుకోవటం యెవరికీ తరం కాదు. ఎన్ని కష్టాలువచ్చినా కుంగిపోకుండా ఎప్పటి మాదిరే అందరితో సాయిలాపాయిలాగా నవ్వుతూ కాలం గడపగలశక్తి నిత్యానంద యే తపస్సువల్లసంపాదించాడో యెవరికీ తెలియదు. మొదట తల్లీ, తరువాత తండ్రీ స్వర్గంచేరుకుని అతన్ని లోకంలో ఒంటరిగా వదిలేసినా అతను దిగులుపడలేదు. ఇంకొకళ్ళయితే అణగారిపోయేవాళ్ళు, నిత్యానందం మాత్రం ఏమీ జరగనట్టుగానే యెప్పటి పట్టుదలతోనే పరీక్షలకి చదివాడు. ఎప్పటి మాదిరిగానే అందరికంటె యెక్కువ గౌరవాన్ని సంపాదించాడు.

అతనికి ఎం. ఏ డిగ్రీరావడటమూ, పూర్వుల ఆస్తితో శేషం లేకుండా హరించుకుపోవడమూ ఒకేసారి జరిగింది. తనది అని చెప్పకునేందుకు నేలకూలుతున్న తాతలనాటి

కొంప ఒక్కటే మిగిలివుంది. సూర్యచంద్రులిద్దరూ ఆ ఇంట్లోనే ఉదయించి అస్తమిస్తూ వుంటారు.

ఇక నిత్యానందానికి ముందు దారిఏది ? ఇక కాలం యెలా వెళ్తుంది? అనేచింత వూళ్ళోవాళ్ళనియెంతో పట్టి పీడించసాగింది. కాని నిత్యానందానికి మాత్రం ఈ విషయంలో చీమకుట్టినంతయినా చింత లేదు.

ఇంత బేఫరవా దేన్నిచూసుకుని ? కాసీ లేకపోతే కాళ్లు వేలగిలపడతయ్ కదా. దమ్మిడీ ఆదాయంలేని నిత్యానందానికి రేపు యెల్లా వెళ్తుందనేబాధ లేశమైనా లేదు. ఉన్న ఊళ్లో కాలుకదపకుండా కూచుంటే ఈయనగారికోసం ఉద్యోగాలు యెదురుగా పరుగెత్తుకొ స్తయ్యా ? ఈయనగారికోసం తేరగా కాచుకుని కూచున్నయ్యా? ఏమిటి ఈమనిషి ధిలాసా? అని ఊరివాళ్ళంతా నిత్యానందం భావిజీవితాన్ని గురించి అక్కర్లేని అందోళనా, తాపత్రయంపడటం సాగించారు అతని కష్టాల్లో వేలువంచి సాయంచేసిన పాపాన ఒక్కరూపోలేదు. కాని యిప్పుడు ఒకొక్కళ్ళూ వేలసలహాలతో వచ్చి అతన్ని వేధించటం మొదలుపెట్టారు. వాళ్ళతో ఈ అర్థంలేని, అవసరంలేని సానుభూతికంటే వాళ్ళ మునుపటి ఉపేక్షాభావమే నిత్యానందానికి సుఖంగావుంది. పొరుగింటి పుల్లయ్యగారు అన్నంతిని చల్లగాలికి షికారు తిరుగుతూ "అబ్బాయ్ నిత్యానందం ఊరికే ఇంటిపట్టునవుంటే యేంలాభం? ఏతాలూకా గుమస్తాగానైనా చేరరాదుటోయ్ ?" అని సలహా చెప్ప వచ్చాడు. ఈ పెద్దమనిషే నిత్యానందం ఊళ్ళోంచి వెళ్తే

అతని ఇంటిని పశువులసాలిడిగా వుపయోగించుకోవాలని ఎదురుచూస్తున్నాడు. తనదొడ్డి పశువులకి ఇరుకుగా వుందనీ, నిత్యానందం వెళ్ళిపోతే తన అభీష్టం నెరవేర్చుకోవచ్చనీ ఆయనగారి తహతహ.

ఈ వంకరటింకర సలహాలన్నీ విని నిత్యానందం నవ్వి మెదలకుండా వూరుకునేవాడు. ఆ నవ్వుని చూస్తే సలహా ఇవ్వ వచ్చిన వాళ్ళకి గరిటెకాల్చి వాతపెట్టినట్లు చుర్రుమనేది.

అతను రేపటిసంగతి ఆలోచించడు. ఇవాళటి సంగతికి చింతపడడు. గడిచినదాన్ని ఎన్నడూ నెమరువేయడు. ఎప్పుడూ చదువుకుంటూ, స్నేహితులతో ఛలోక్తులు విసురుతూ, పొలాలంబో పనిలేకుండా తిరుగుతూ కాలం గడుపుతాడు. అతన్ని చూస్తుంటే వాన బరువులేకుండా, ఉరుముల అరుపు లేకుండా విలాసంగా గాలి యెటుకొడితే అటు తేలిపోయే సంక్రాంతిమబ్బు గుర్తుకువస్తుంది. ఉల్లాసంగా పాలనురుగు పొంగి ఆకాశంలో ఆటలాడే సంక్రాంతిమబ్బుకీ, జీవితంలో దుఃఖాన్నంతసీ దిగమింగి చిరునవ్వుతో కష్టాలని యెగరకొట్టేసి కులాసాగా కాలంగడిపే నిత్యానందానికి యెంతో పోలికవుంది.

ఇప్పుడు నిత్యానందానికి యిర్వైనాలుగో యేడు. ఇంత కాలమూ అతను చదువుపూర్తిఅయితేకాని పెళ్ళిమాట ఆలోచించనని సూటీగాచెప్పేసి యెందరి తండ్రులగుండెల్లోనో రాళ్లు పడేశాడు. ఇప్పుడు యేంచెయ్యాలో యేవిధంగా తప్పించుకోవాలో తోచటంలేదు. ఇప్పుడు నిత్యానందం ఊళ్లో చాలా మందికి నిరుపయోగిగా కనిపిస్తున్నా పెళ్ళికావలసిన పిల్లల

తండ్రులకిమాత్రం అతని విలువ అపారంగా కనిపిస్తోంది. ఇదివరకెవరూ అతనికి అంతవిలువ ఇచ్చివుండరు. అయినప్పటికీ నిత్యానందం పెళ్ళిని గురించిన చింతకి మనసులో యేమూలా తావివ్వలేదు. క్షణంసేపు తీరికగా కూచుని ఆలోచించనూ లేదు.

ఇన్నాళ్ళనుంచీ దూరంగా నెట్టివేసిన సమస్య ఒక్కసారిగా నెత్తికెక్కి కూచుంది. దీన్ని ఏదోవిధంగా పరిష్కారం చెయ్యాలి. ఏదో తేల్చమని పెళ్ళిళ్ళపేరయ్య వూపిరి సలపనియ్యడంలేదు. కావాలంటే పిల్లని యిక్కడికే తీసుకువచ్చి చూపిస్తామని విసుగెత్తిస్తున్నాడు. సంపాదన లేనివాడికి సంసారమెందుకని నిత్యానందం తప్పించుకోవాలని చూశాడు. పెళ్ళిళ్ళపేరయ్య యెత్తుకి పై యెత్తువేశాడు. "నువ్వు కానీ సంపాదించనక్కర్లేకుండా కాలుమీద కాలువేసుక్కూచోవచ్చు. అటువంటి సంబంధమే నీకు వెతుక్కొస్తాను. నువ్వు ఊఁ అంటే చాలు" అని మొండికేసి కూచున్నాడు. నిత్యానందం తల వూపక తప్పిందికాదు.

అంతకుముందే నిత్యానందం వింతమనిషి అని లోకం తీర్మానించింది. అతను పెళ్ళికి ఒప్పుకున్నాడని వినగానే లోకం ఒక్కసారిగా విస్తుపోయింది. అందరూ విడ్డూరంగా అతని పెళ్ళినిగురించే చెప్పుకోటం సాగించారు. నిత్యానందం తొందరపడ్డాడన్నారు కొందరు. అతను పెళ్ళివిషయంలో తమని సంప్రదించకపోవటంవల్ల తప్పటడుగు వేశాడని చింతించారు కొందరు. డబ్బు యెంతటివాడినైనా లొంగదీస్తుందని వేదాంతం చెప్పారు కొందరు.

ఏవ రేమనుకున్నప్పటికీ మనోరమ మాత్రం తన పద్ధెనిమిదేళ్ళ జీవితంలోనూ అనుభవించి ఎరుగని అపూర్వానందంతో పొంగిపోయింది. తను యావజ్జీవితమూ వృద్ధకుమారిగా వుండిపోతానేమోనని భయపడిన మనోరమకి యీనాటికి కల్యాణ ఘడియ వచ్చింది. చీకటితో కారుకమ్మిన ఆమె జీవితంలో తొలిసారి మెరుపు మెరిసింది. వెలుగుకోసం వేసారిన ఆమెకళ్ళని మిరుమిట్లుగొలిపే వెలుగు ఆమె జీవితంలో వుదయించింది.

ఆమె అదృష్టానికి తల్లిదండ్రులూ, బంధువులూ వుప్పొంగిపోయారు. కాని అందరికంటె మనోరమే తన అదృష్టానికి మురిసిపోయింది. తన ఆశలకికూడా అందని ఆనందంవచ్చి మనోరమ మనసుని ఊయలలూగించింది.

పెళ్ళి పీటలమీదనే నిత్యానందం మొదటసారి మనోరమ ముఖాన్ని చూశాడు. అతనిముఖంలో ఎటువంటిభావమూ మనోరమకి కనబడ లేదు. అతనిముఖంలో మెచ్చుకోలు లేదు, ఆశాభంగం లేదు. తనని చూడగానే అతను యెంతో రోత పడతాడనీ, చీదరించుకుంటాడనీ మనోరమ అనుకుంది. కాని అతనిముఖం ఏవిధమైన చలనమూ గోచరించకపోయేసరికి మనోరమకి ఆశ్చర్యం వేసింది. తన ముఖాన్ని చూసి యెందరు వంకలు పెట్టారు. తనకళ్ళు చిన్నవనీ, తనరంగు నలుపనీ, తనముక్కు పొడుగనీ, తనమూతి వంకరనీ యెందరు నిరాకరించారు. అటువంటిముఖం తన భర్తలో ఏవిధమైన సంచలనాన్నీ కలిగించక పోయేసరికీ మనోరమ విస్తుపోయింది. తనభర్తకళ్ళు అందరి కళ్ళవంటివి కావా? అతను అందరిలాంటివాడు కాడా? అతనికి తన

అందంతో పనిలేదా? అతను కోరే అందం అందరూ కోరేటటు వంటిది కాదా? కాదు, వారు అందరిలాంటివారుకారు. వారికీ మరొకరికీ పోలికలేదు, అనుకుంటూ మనోరమ తన హృదయ సింహాసనంమీద అతన్ని కూచోపెట్టి అభిషేకించసాగింది. ఇంతలో సూత్రం కట్టేతరుణం వచ్చింది. పెళ్ళిపందిట్లోయెవరో ఆవేళకే తుమ్మారు. అంతా నొచ్చుకున్నారు. ఆతుమ్ము మనోరమ గుండెలో ఫిరంగిమోతలా మోగింది. తెలియని భయంతో ఆమెలోపల నీరయిపోయింది. సూత్రం కడుతున్నప్పుడు నిత్యానందంవేళ్ళు వణకటం మనోరమ కనిపెట్టింది. ఒక్కసారిగా గుండెల్లో లక్ష అశుభశంకలు జొరబడినయ్. సుడిగాలిలో యెండిన ఆకులాగా మనోరమ ఆందోళనతో సుడి తిరిగిపోయింది. తనని చూడకుండానే భర్త పెళ్ళికి యెందుకు ఒప్పుకున్నాడు? తను ఇందాకటినుంచీ గాలిలో మేడలు కడుతున్నదేమో? తను తండ్రికి ఒక్కతే కూతురనీ, తండ్రి ఆస్తి అంతా తనకే సంక్రమిస్తుందనీ, డబ్బుకోసం పెళ్ళికి ఒప్పుకున్నాడేమో? అతను పెళ్ళాడుతున్నది తననికాదు, తనతండ్రి ఆస్తిని. డబ్బుకోసం హృదయాన్నీ, జీవితాన్ని అయిష్టంతో బలిపెడుతున్నాడేమో? బెదురుతూ మళ్ళీ ఒకసారి భర్తకేసి చూసింది. తుమ్మెద రెక్కల్లాగా నల్లటి ఉంగరాలజుట్టూ, మిసమిసమెరిసే ముఖమూ, విశాలమైనకళ్ళూ, బంగరుకాంతులని వెదజల్లుతున్న అతని రూపమూ చూడగానే మనోరమ సందేహాలన్నీ యెరిగిపోయినయ్. అనవసరంగా అతన్ని తను నీచుడినిచేసి నిందిస్తోంది. అతను తనని మోసగించలేదు, నిజానికి తనే అతన్ని మోసగిస్తున్నదేమో? ఏదో అర్థంకాని

బాధతో మనోరమ హృదయం గిలగిల తన్నుకుంది. ఏదో తెలియని జాలితో ఆమె మనసు కరిగిపోతోంది. నిత్యానందం ఆమె కళ్ళకి యెంతో దీనంగా కనిపించాడు. డబ్బుని యెరపెట్టి తనవంటి అంద వికారిని అతనికి అంటకడుతున్నారు. ఈకుట్రలో తనకీ భాగముంది, ఈమోసంలో తనూ పాల్గొన్నది. ఈ అన్యాయానికి తనూ సమ్మతించింది. ఇంత అక్రమాన్ని సహిస్తూ కూడా నిశ్చలంగా కూచున్నాడు నిత్యానందం. తనకేమీ జరగనట్లుగా నాటకం చూస్తున్న ప్రేక్షకుడిలాగా కూచో గలిగాడు. ఇదిచూసి చెప్పలేని సిగ్గుతో మగ్గిపోయింది. మనోరమ, తను అతని కాలిగోటికికూడా సరికాదు, అతని ప్రక్కన నిలబడటానికే తనకి తాహతులేదు, అనుకోసాగింది మనోరమ. అతనికేసి కన్నెత్తి చూడటానికికూడా ఆమెకి ధైర్యం చాలటంలేదు, అతని చెయ్యి తన తలమీదవుంచిన కాస్సేపూ ఆమె కొక యుగంగా తోచింది, ఆ చెయ్యి తన పాతాళానికి అణచివేస్తే యెంతో బాగుండుననిపించింది. తనచెయ్యి అతని తలమీద ఆనించడానికి యెంతో సంకోచంతో గజగజ వణికిపోయింది. అతన్ని తాకేటందుకుకూడా తనకి తాహతు లేదనిపించింది. ఈ తతంగమంతా యెప్పుడు ముగుస్తుందా అని మనోరమ తహతహ పడింది.

పెళ్ళి పందిట్లో హోమాగ్ని ముందు కూచున్నప్పుడు మనోరమ గుండెల్లో రగిలిన జ్వాల యెంతకీ చల్లారలేదు. అది నానాటికీ భగభగ రగులుతూ ఆమె గుండెల్లో ఆరని బడబాగ్నిగా మారింది. ఈమంట నాటిరాత్రి ఆమె సర్వస్వాన్ని భుగభుగ మాడ్చివేస్తున్నట్లనిపించింది. మోటు సరసాలూ,

వెకిలినవ్వులూ, వెర్రిపకపకలూ ఆమెని అగ్నిగుండంలోకి తరుముతున్నట్లన్నిపించింది. తమ సిగ్గుని చంపుకుని మొండి తెగువ తెచ్చుకుని లోపలికి వెళ్ళింది. నిత్యానందం ఒకసారి తన కేసి విప్పారినకళ్ళతో చూశాడు. ఆమె ప్రాణం దీపం వెలుతురులో తాచుపాములాగా మెలికలు చుట్టుకుపోయింది. తనని పలుకరించలేదు. మెదలకుండా బైటికివెళ్ళి వెన్నెట్లో వొట్టినేల మీద పడుకుని నిద్రపోయాడు. తన సాహసానికి తగినశిక్ష జరిగిందనుకొని మనోరమ పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ కిందికి వెళ్ళిపోయింది. మెట్లగదితలుపుకి బైటగొళ్ళెం పెట్టివుంది. మనోరమ చతికిలబడిపోయింది, మళ్ళా మేడమీదకి వెళ్ళటానికి కాళ్ళురాలేదు. మెట్లమీదనే తెల్లవార్లూ మోకాళ్ళమీద తలపెట్టుకుని వెక్కి వెక్కి యేడుస్తూ కూచుంది. ఆమెకి జీవితం దరీ తెన్నూ లేని అయోమయంగాకనిపించింది. ఆమె ఆశలన్నీ నేలకూలిపోయినయ్. ఇక కన్నీళ్లే ఆమెకి ఏడని చెలికత్తెలు. ఇక చీకటే ఆమెకి అంతరంగసఖి.

ఆ దుఃఖంలో మనోరమ మనస్సు 'తండ్రీ నన్నెందుకు జన్మమెత్తించావు?' అని దీనంగా దైవాన్ని ప్రశ్నించింది. మారులేని ఈ ప్రశ్నతోనే ఆమె మనసు బరువెక్కిపోయింది.

మనోరమ భర్తయెదుటికి పోకుండా ఏమూలలనో నక్కి కూచునేది. కాని భర్తకి కాఫీ యిచ్చిరమ్మనీ, ఫలహారం పెట్టి రమ్మనీ, స్నానానికి పిలవమనీ మాటిమాటికీ ఆమెని వేధించేవాళ్ళు, వినక తప్పేదికాదు. మనోరమ అన్నీ యంత్రంలాగా చేసేది, భర్త సమాధానానికి ఎదురుచూడకుండానే అతని ఎదుటినుంచి వెళ్ళిపోయేది, ఒకనాడు పొద్దున మనోరమ కాఫీ

భర్తముందుపెట్టి గబగబా వెళ్ళిపోతోంది. 'ఇదుగో నిన్నే' అని నిత్యానందం పిలిచాడు, మనోరమ ఆశ్చర్యంతో, భయంతో, సిగ్గుతో నిలబడి వెనక్కి చూసింది. "నేను రేపు వెళ్తున్నా" అని ముక్తసరిగా నిత్యానందం అన్నాడు. ఎక్కడికి ఎందుకు మళ్ళీ యెప్పుడువస్తారు అని లోపల యెన్నో ప్రశ్నలు గంతులేసినయ్. కాని ఒకటి పెగిలి పెదవులమీదికి రాలేదు. మనోరమ మౌనాన్నిచూసి నిత్యానందం మళ్ళీ అన్నాడు 'నేను రేపు వెళ్తున్నా', ఈసారి మనోరమ సిగ్గువిడిచి భర్తతో మొదటిసారి మాట్లాడగలిగింది. 'ఎక్కడికి?' అనే సరికి గొంతుపట్టుకుపోయింది. నిత్యానందం చెప్పటం మొదలు పెట్టాడు. అప్రయత్నంగానే అతను మనసువిప్పి మనోరమకిఅన్ని సంగతులు చెప్పేశాడు. ఇంతకాలమూ అతని మనసులో ఒక తీరనికోరిక దాగివుంది. అతనికి అభిమాన విషయమైన సాహిత్యంలో పరిశోధనచేసి డాక్టరుడిగ్రీ సంపాదించుకోవాలని అతను కలలుకనేవాడు. ఎం. ఏ, అయినాక యింకో అయిదేళ్ళు పరిశ్రమ చేస్తేగాని అతని ఆశలు సఫలంకావు. ఈ అయిదేళ్ళూ చదువుకోవటానికి యెవరూ సాయంచేసేవాళ్ళు కనిపించలేదు. అందుకోసమే నిత్యానందం డాక్టరుడిగ్రీ ఇంత కాలమూ గగన కుసుమంగా వుండిపోయింది.

ఈ మాటలు వినేసరికి మనోరమ మనసులో ఒక వింత సంచలనం బయలుదేరింది. అతని జీవితాశనుసఫలం చేసే బాధ్యత తనమీద వుందని మనోరమ ఆ క్షణంలోనే గ్రహించింది. ఆతనికి ఎరగాచూపించి తనలాటి అందవికారిని అంట

కట్టటానికి పనికివచ్చింది. తండ్రిడబ్బు, ఆ ధనమే తన భర్త తీరని కోరికని తీర్చేటందుకు వినియోగపడితే? అంతకంటె మనోరమకి కావలసినదేముంది? అప్పటికి కాని ఆమె గుండెలో మంట కొంచమైనా చల్లారదు. అప్పటికిగాని ఆమెని అణచి వేస్తున్న బరువు కొంచమైనా తేలికపడదు. మనసులో ఏమైనా సరే భర్తకి ధనసహాయంచేసే కర్తవ్యం తనపై కెత్తుకుంది. "నాన్నగారితో చెబుతాను త్వరలోనే మీ ప్రయాణం సాగేట్లు చూస్తాను" అంది మనోరమ. భార్య మాటలు విని నిత్యానందం పొంగిపోయాడు. పూర్ణిమలాటి నిండుజాబిల్లిని తాకేటందుకు అవకాశం దాకా ఎగిరే కెఱటంలాగా అతని హృదయం చిందులేసింది.

ఆనాడు నిత్యానందం ప్రయాణం, పొద్దుటినుంచి మనోరమ అతని పుస్తకాలూ సామానులూ సర్దటంతో మునిగిపోయింది. భర్త తననికూడా ప్రయాణమై రమ్మంటాడేమోనని ఆమె హృదయం ఎంతో ఆరాటపడింది. తనుకూడా అతనితో వెళ్ళాలి. అక్కడ భర్తకి ఏలోటు రాకుండా కంటికి రెప్పగా కనిపెట్టాలి.

మనోరమ ఆశలన్నీ అడియాసలైనయ్. నిత్యానందానికి తననికూడా వెంట తీసుకుపోవాలనే సంకల్పమే వున్నట్లు లేదు. తనని భర్త హృదయమున్న, జీవమున్న స్త్రీగా పరిగణించ లేదనే అనుమానం కలిగింది. అతని జీవితాశలు నెరవేర్చుకునేందుకు తనని కేవలం ఒక సాధనగా ఉపయోగించుకుంటున్నాడు. అంతకు మించిన విలువ తన కివ్వటంలేదు.

ఈ బాధతో మనోరమ వేగిపోతోంది. తనపట్ల భర్తచూపు తున్న ఉపేక్ష ఆమెగుండెల్ని చీల్చివేస్తోంది. ఎంతో అభిమానం వేసింది. కిందికివెళ్తే ఇంట్లో అంతా నీ ప్రయాణం మాట ఏమన్నారు అని అడుగుతారు. ఇక్కడికివస్తే భర్త ఆమాటే ఎత్తడు. అతనికి తననికూడా తీసుకుపోవాలనే కోరిక ఎందుకు లేకపోవాలి? అతనివెంట పోవాలని తనమనసే ఎందుకంత ఆరాటపడాలి?

చివరికి మనోరమ సిగ్గువిడచి నోరుతెరచి తనే అడిగింది. "నన్ను మీతో తీసుకుపోరూ?" అని. నిత్యానందం మొదలకుండా వూరుకోక "నువ్వుకూడా దేనికి?" అన్నారు. ఈ మాటలు మనోరమకి శూలాలలాగా గుచ్చుకున్నయ్. ఆమె తల గిరగిర తిరిగింది. అతనిముందు నుంచో లేకపోయింది. అంత పరాభవాన్ని ఇదివరకెన్నడూ ఆమె భరించి ఎరుగదు. రోషంతోనూ దుఃఖంతోనూ ఆమెముఖం జేవురించి ఆపుకున్నా ఆగకుండా కన్నీళ్ళు జడివానలాగా కురిసినయ్. ఇది చూసి నిత్యానందం విస్తుపోయాడు. అతనికి నవలల్లోనూ నాటకాలలోనూ, కవులు ఇంద్రజాలంతో సృష్టించే పాత్రలతోనే పరిచయముంది. వాటిని అర్థంచేసుకోటంమాత్రమే అతనికి తెలుసు. వాటిమీద సానుభూతి చూపటమే అతనికి తెలుసుకాని అతని ఎదుట సజీవమైన మానవహృదయం నిలబడి సానుభూతిని కోరుతుంటే ఏంచెయ్యాలో, ఏం మాట్లాడాలో తెలియలేదు. ఎల్లా ఓదార్చాలోకూడా తోచలేదు.

ఎంతోసేపటికి మనోరమ మనసు తిప్పుకుంది. సిగ్గుని

అణుచుకుంది. అభిమానాన్ని చంపుకుంది. "నేను వస్తాను. వచ్చి మీకు వండిపెడతాను. మీ చదువుకి అడ్డురాను. మీ రెక్కడ వుంటే అక్కడేవుంటాను తీసుకుపొండి. నన్ను ఒంటరిగా ఇక్కడ దిగవిడవకండి. మీకు పుణ్యముంటుంది. మీ కాళ్లు పుచ్చుకొని వేడుకుంటున్నాను" అని భర్తకాలిమీద పడింది. నిత్యానందం తొణుకూ బెణుకూ లేకుండా నిశ్చలంగా అన్నాడు "నీ యిష్టం" అని. మనోరమ ఈమాటల కాఠిన్యానికి తాళలేకపోయింది. అతనికాళ్ళని చుట్టుకుని విడవకుండా "మీకు ఇష్టంలేదా ? చెప్పండి" అని దీనంగా అడిగింది. నిత్యానందం కన్నీటిచారలతో నిండిన ఆమెముఖంకేసి ఒకసారి చూశాడు. అప్రయత్నంగా "రా" అనేశాడు.

మనోరమ ముఖం విప్పారింది. కళ్లు తుడుచుకుంటూ కిందికి వెళ్ళిపోయింది. తన సవరణమూలంగా ప్రయాణం ఆలస్యంకాకుండా సామానంతా కట్టి సర్దుకుని బయలుదేరింది.

బండి ఎక్కేముందు అత్తగారూ మామగారూ కన్నీళ్లు కుక్కుంటూ నిత్యానందంతో అన్నారు "దూరాభారం వెళ్తున్నారు. ఎప్పుడూ పిల్ల మమ్మల్ని విడిచియెరుగదు. దాని భారమంతా మీదే, దాన్ని మీ చేతుల్లో పెట్టాం. వెళ్ళగానే ఉత్తరం రాయించండి."

నిత్యానందం ఒక్కమాటయినా మాట్లాడలేదు. తల మాత్రం వూపాడు. అతని నడవడికి అందరిగుండెలూ చివుక్కుమన్నయ్. భర్త మౌనంవల్ల తల్లిదండ్రులు ఎంత నొచ్చుకున్నారో అని మనోరమ లోపల ఎంతో బాధపడింది.

బండి కళ్ళముందునుంచి దాటిపోగానే మనోరమ తండ్రి కోపంతోనూ, రోషంతోనూ "మనడబ్బు పరువయింది, మనతో నోరువిప్పి మాట్లాడటం మాత్రం ఆయనకి పరువు కాలేదు" అన్నాడు. తల్లి కళ్ళుతుడుచుకుంటూ "ఇన్నేళ్లూ పెంచి కన్నతల్లిని చివరికి ఈ కొయ్య మనిషికి అప్పగించాం" అంది. అప్పటికే వాళ్ళిద్దరి మనసుల్లోనూ మనోరమ భావి సుఖాన్ని గురించిన సందేహాలు అలుముకుపోయినయ్. మనోరమని సాగనంపటానికి వచ్చిన పొరుగింటి పెద్దముత్తయిదువు అంది "ఈ కాలంపిల్లల్లో ఇంత యోగ్యురాలులేదు" అని. తల్లి ఈ ప్రశంసకి పొంగింది. కాని "దానిగీత ఎల్లావుందో" అనుకుంటూ కళ్ళు తుడుచుకోసాగింది.

దూరప్రయాణం, మనోరమని ఆడవాళ్ళ ఇంటరులో ఎక్కించాడు. దారిలో మధ్య ఒక్కసారిఅయినా నిత్యానందం కనిపించలేదు. భార్యకి ఏంకావాలో కనుక్కోటానికైనా రాలేదు. పక్కనకూర్చున్న స్త్రీల భర్తలూ, బంధువులూ మాటిమాటికివచ్చి కాఫీలు, ఫలహారాలు, పళ్ళూ కొని తెచ్చి పెడుతున్నారు. తనభర్తకూడా తెచ్చిపెడతాడేమోనని మనోరమ ఆశపడింది. కాని ఎంతకీ భర్త జాడ కనిపించదు. పక్కవాళ్ళు నువ్వొక్కతెవేనా ? ఎవరూ కూడాలేరా? నీకు ఆకలి వేయటంలేదా ? అని ప్రశ్నలతో గుచ్చుతున్నారు. ఎన్నడూ ఇంతదూరం ప్రయాణంచేసి ఎరుగదు. భయం, ఆకలీ, దుఃఖం, అవమానం, గుండె రగిలిపోతోంది. విధి తనకి విషమపరీక్ష ఎందుకు విధించాడో తెలియటంలేదు. ఈ వివాహబంధంలో ఇంతబాధ, ఇంతవేదనా, ఇంతపరాభవం దాగివుంటవని మనో

రమ ఎన్నడూ అనుకోలేదు. ఓ కరుణామయా ఈ అందవికారిని ఎందుకు పుట్టించావు ? ఇంత దుఃఖం ఎందుకు విధించావు ? ఈ దారుణలోకంలోకి ఎందుకు విసిరివేశావు? తండ్రీ నన్నెందుకిల్లా పరీక్షిస్తున్నావు ? అని మనసులో పరిపరివిధాల విలపించింది. ఆ ప్రయాణం మూడు పూటలా నకనకలాడుతూ క్షణమొక యుగంగా గడిపింది. తనికి పెళ్ళికాని రోజులలో ఎప్పుడూ ఇంత దుఃఖాన్ని. ఇంతబాధని, ఇంత అవమానాన్ని భరించలేదు. మునుపటి బాధలన్నీ పెళ్ళికాగానే దూరమైపోతయ్యని ఎంతో ఆశించింది. కాని పెళ్ళిఅయిన క్షణంనుంచీ అంతకి వెయ్యిరెట్లబాధ ఆమెమీద విరుచుకుపడింది. క్షణం కూడా శాంతిలేదు. క్షణమైనా మనసులో విశ్రాంతిలేదు. ఒక చెఱనుంచి విడుదలపొంది మరొక ఘోరమైన బంధిఖానాలో ఖైదీ అయింది. దరీ తెన్నూ లేని అయోమయంలో చిక్కుకుపోయింది. భర్త తనని మోసగించడు కదా? ఒంటరిదాన్ని చేసి డబ్బుతీసుకుని పారిపోడుకద ? కానిచోట తన కెవరుదిక్కు ? తన పాపమేముంది ? తను చేసిన నేరమేమిటి ? మరి ఎందుకు తనకీ శిక్ష ? ఈ కఠోరమైన శిక్ష ?

ఎక్కిన స్టేషనులో కనిపించిన భర్త దిగవలసిన స్టేషనులో వచ్చి మళ్ళీ కనిపించాడు. ఇంతసేపూ తన సంగతే మరిచిపోయాడా ? గుర్తువుండి కూడా బుద్ధిపూర్వకంగానే తనని విస్మరించాడా ? తను ఎంత ఇబ్బందిపడిందో, ఎంత బాధపడిందో. ఆసంగతే అడగడు. ఆమాటే ఎత్తడు. ఆకలికి ఎంత వేగి సొమ్మసిల్లి పోయిందో, మాటయినా మాట్లాడడు. ఎందుకిల్లా చేశాడు ? తనమీద నిరాదరణ వుండచ్చు.

తనని నిగసించవచ్చు. కాని ఇంత నిర్దయ దేనికి ? తను ఏం అపచారం చేసింది ?

దిగటంతోటే బండికుదిర్చి మనోరమని సూటిగా ఒక హోటల్లోకి తీసుకెళ్ళాడు. మూడుపూటల తరవాత అన్నం కళ్ళబడేసరికి మనోరమకి ప్రాణంలేచివచ్చింది. ఒక గది తీసుకున్నారు. అందులో మనోరమ సామనంతా సర్దుతోంది. తీరిక కాగానే ఇంటికి ఉత్తరం రాసింది. తమరిద్దరూ సుఖంగా ప్రయాణంచేసి గమ్యస్థానం చేరుకున్నారుట! దారిలోపడ్డ ఇబ్బందులన్నీ అప్పుడే మరిచిపోయింది. అప్పుడే క్షమించి వేసింది.

ఎంతోకష్టంమీద నిత్యానందానికి అద్దెఇల్లు దొరికింది. ఇల్లుదొరికినదగ్గరనుంచీఇల్లాలికిక్షణంకూడాతీరటంలేదు...అన్నీ సర్దటం అమర్చటం, తీర్చిదిద్దటం, వంటచేయటం వీటితోనే మనోరమకికాలం గడిచిపోతోంది. భర్తకి ఏలోటూరాకుండా సేవచేయటంలోనే మనోరమ మునిగిపోయింది.

* * *

కూతురునీ అల్లుడినీ దసరాకి రమ్మని మామగారు ఆహ్వానించారు. మనోరమ భర్తని అడిగింది. నిత్యానందం రావటానికి వీలులేదన్నాడు. మనోరమ వెళ్తే తన అభ్యంతరమేమీ లేదన్నాడు. ఏదో సాకుచెప్పి మనోరమ తను వెళ్ళటం కూడా మానుకుంది.

ఈసారి సంక్రాంతికి కూతురినీ అల్లుడిని వెంటతీసుకుపోవాలని మనోరమతల్లి స్వయంగా వచ్చింది. నిత్యానందం

తనకి రావటానికి తీరిక లేదన్నాడు. అది సాకుకాదు. నిజమే. మనోరమ వెళ్తే తనకేమీ అభ్యంతరం లేదని చెప్పాడు. పుట్టింటికి వెళ్ళాలని ఎంతో ముచ్చటపడిన మనోరమకి ఈ మాట వినగానే సంబరమంతా చల్లారిపోయింది. కాని కొన్నాళ్ళ పాటు పుట్టింటికి వెళ్ళి రావాలనే కోరికనిమాత్రం తీసివేయలేక పోయింది. వెళ్ళటానికేం ? వెళ్తుంది. మళ్ళీ తిరిగిరావటాన్ని గురించే మనోరమకి చింత. తనని తిరిగి రమ్మని భర్త ఉత్తరం రాయదేమో? తననిపూర్తిగా మరచిపోతాడేమో? అందుకే మనసు వెనకాడుతోంది.

చివరకి తల్లిమాట తీసివెయ్యలేక మనోరమ వెళ్ళింది. రైలుకి బండికూడా తనే కుదుర్చుకోవలసివచ్చింది. తను బండి ఎక్కేవేళకైనా భర్త సాగనంపటానికి గుమ్మందాకా వస్తాడేమో ననుకుంది. కాని అతను గదిలోనే చదువులో మునిగి పోయి కూచున్నాడు.

బండి యెక్కేనప్పటినుంచీ మనోరమ తల్లి ఒక్కవరసన అల్లుణ్ణి దుయ్యపట్టటం సాగించింది. ఇంత తలవంపు జరుగుతుందని తెలిస్తే తను వచ్చేదేకాదు. ఇంటికి వచ్చిన చుట్టాన్ని పలకరించటానికూడా తీరికలేని మనిషిని నేనెక్కడా చూడలేదంది. వీటిలో ఆవగింజత్తైనా అబద్ధంలేదు. కాని ఎందుకో మనోరమ మనసు చివుక్కుమంది. భర్తమీద ఈగవాలినా సహించలేదు. "నాకేం తెలియదు అమ్మా. నువ్వేం కష్టపెట్టు పెట్టుకోకు" అని సర్ది చెప్పింది. కాని మనోరమతల్లి అక్కడ పట్టలేకపోయింది. "నేను పసిపిల్లను కానే రమా. నాకూ లోకం సంగతి తెలుసు. నీభర్తలాంటి మనిషి మూడులోకాల్లోనూ

దొరకదు. నీకాపురాన్ని చూశాక ఆ మాత్రం తెలుసుకోలే ననుకున్నావా తల్లీ ?" అంది ఎంతఆపుకున్నా మనోరమకి దుఃఖం ఆగలేదు. తల్లీ అంతా కనిపెట్టింది. ఆమెముందు తను ఏదీ దాచలేదు. ఉన్న మూడుపూటల్లోనే తల్లి తనగోడు అంతా తెలుసుకో గలిగింది. "రమా, నువ్వుకాబట్టి ఆ ఇంట్లో కాపురం చేస్తున్నావు. ఇంకోళ్ళయితేనా?" అని తల్లి అనగానే కట్టతెగిన ప్రవాహంలాగా మనోరమ కన్నీళ్ళు పొర్లుకొచ్చినై.

రాగానే సుఖంగా చేరినట్లూ, క్షేమం వెంటనే తెలుప వలసిందనీ మనోరమ భర్తకి ఉత్తరం రాసింది. అనుకున్నట్లు గానే జాబురాలేదు. ఇంతలో ఒకటో తేదీ వచ్చిందని. భర్త డబ్బుకి ఇబ్బందిపడుతూవుంటాడు. తండ్రితో చెప్పి డబ్బు పంపించింది. మనియార్డరు అందినట్లు రశీదువచ్చింది. కాని ఉత్తరం లేదు. మనోరమ మనసెంతో చిన్నబోయింది. అంత విలువలేని వస్తువుగా తనని నిరసిస్తున్న భర్తనే తను పట్టుకు పాకులాడుతున్నది. అతను దూరంగా విదిలిస్తున్నా అతని పాదాలనే చుట్టుకుంటున్నది. కాని ఇల్లా ఎంతకాలం గడవాలి? బతుకు ఎల్లా వెళ్ళదీయటం ? ఇంత పరాభవాన్ని ఎంతకాలం సహించటం ? ఇంత అభిమానాన్ని సిగ్గునీ విడిచి ఎల్లా జీవించటం ?

ఒక్కొక్కరోజు గడుస్తున్నకొద్దీ మనోరమ మనసులో మరింత చీకటి అలుముకుపోతోంది, తను లోకంలో ఎందుకు జీవించాలో తెలియటంలేదు. తను లోకంలో దుఃఖంకోసమే జన్మమెత్తింది కాబోలు. తనకి సుఖపడేరోజు అంటూ లేదు,

మనోరమ మనోవేదన తల్లి కనిపెట్టింది. ఎంతో ఓదార్చింది. కట్టుకున్నవాడికి బరువైనంతమాత్రాన కన్నవారికి బరువైపోతుందా? భర్త దగ్గర మనోరమకి చాకిరితప్ప వేరేముంది? పుట్టింట్లోవున్నా భర్తదగ్గరవున్నా మనోరమకి ఒకటే సుఖం. అల్లుడు పంపమని రాస్తేగాని కూతురుని పంపవద్దని తీర్మానించుకున్నారు.

కాని నిత్యానందానికి అన్నీ సరిగా జరుగుతున్నయ్యో లేదో? తను లేకపోవటంవల్ల అతనెంత ఇబ్బందిపడుతున్నాడో? అతని చదువు సరిగా సాగుతుందో లేదో? అతనివంట్లో తిన్నగావుందో లేదో? తను తప్ప అతనికి నా అనేవాళ్ళెవరున్నారు? తన్నినాసరే ఆయన పాదాల దగ్గర పడివుండటమే తన విధి. ఆయన సన్నిధానంలో ఎంత కష్టం అయినా సహించవలసిందే అనుకుంది మనోరమ. తల్లిదండ్రులు ఇంకొన్నాళ్ళపాటు వుండమని ఎంతో బలవంతంచేశారు. అయినా మనోరమ వినకుండా బయలుదేరింది.

మనోరమ వచ్చేసరికి భర్త ఇంట్లో లేడు. లైబ్రరీకి వెళ్ళివుంటాడు. మారుతాళంతో తలుపుతీసి లోపల ప్రవేశించింది. ఇల్లంతా చికాకుగా చిందరవందరగా వుంది. ఎక్కడచూసినా పుస్తకాలే, ఎక్కడచూసినా మాసినగుడ్డలే, తనకికచేతినిండా పని. ఈ ఇంటిని చక్క బెట్టటానికి కనీసం ఒకరోజంతా పనిపడుతుందని అంచనా వేసుకుంది మనోరమ. ఇల్లాఅనుకుంటూ బల్లమీది పుస్తకాలు సర్దుతుంటే పుస్తకాల్లోంచి ఒక కవరు జారిపడింది. దానిమీద భర్త పేరువుంది. ముత్యాలలాటి అక్షరాలు ముచ్చటగా ఉన్నయ్. అది ఆడ

దస్తూరి అని వెంటనే కనిపెట్టగలిగింది. రాసిన వారి పేరేమిటోనని ఆత్రంగా ఉత్తరం చివరికి తిప్పిచూసింది. ఎవరీ అనూరాధ ? తన భర్తని "ప్రియా" అని సంభోధించటానికి సాహసించిన ఈ స్త్రీ ఎవరో ? ఈమేనా తనకీ భర్తకీ మధ్యదాటలేని అఖాతాన్ని కల్పించింది ! ఈమెయేనా తన కష్టాలన్నిటికీ కారకురాలు ? ఈమెయేనా భర్తని తనకి దూరం చేస్తున్న మాంత్రికురాలు ? చిమ్మ చీకటిలో అడుగు సాగని బాటసారికి మెరుపు మెరిసినట్లుగా వుంది. నీదో రహస్య గృహానికి తాళం చెవి దొరికినట్లుగా ఉంది. ఆ ఉత్తరాన్ని భద్రంగా దాచింది. అది దొంగతనమే అయినప్పటికీ మనోరమకి సంకోచం కలగలేదు. ఆ ఉత్తరం తన చిక్కులన్నీ విడదీయగలదనే వెర్రి ఆశతో దాన్ని భద్రపరిచింది.

నిత్యానందం ఇంటికి వచ్చాడు. మనోరమ ఎప్పుడు వచ్చావని అడిగేడు. ఆ పలకరింపు ఆమెకి పదివేలు. దానితో మనోరమ పులకించిపోయింది. "మీరులేనప్పుడు మీ ఇంట్లో దొంగలాగా జొరబడ్డాను" అంది. నిత్యానందం అదే ధోరణిలో "నీ ఇంటికి నువ్వు రావటం దొంగతనమా ? అన్నాడు.

అతని ధోరణి మారిందేమో, రాగానే తనని పలకరించాడు. తను లేనప్పుడు అతనిలో మార్పు ఏమైనా వచ్చిందేమో ? తను లేకపోవటంవల్ల తన విలువ తెలుసుకోగలిగాడేమోనని ఆశపడింది మనోరమ.

భర్త ఉత్తరం కోసం వెతుక్కుంటాడు. కనపడదు. బాధపడతాడు. చికాకు పడతాడు. తనని అడుగుతాడు. తను

తీయలేదని చెబుతుంది. అతను ఉత్తరంకోసం ఇల్లంతా గాలి స్తుంటే తను తమాషాచూస్తుంది. అతనిచేత బతిమాలించు కుని చివరికి ఉత్తరం యిస్తుంది. రాసిన మనిషి కథఅంతా చెప్పమని అడుగుతుంది. ఈ రహస్యం ఇంతకాలం దాచి నందుకు అప్పుడు భర్తని దండించవచ్చు ననుకుంది.

కాని నిత్యానందం ఉత్తరంకోసం వెతుక్కోనూలేదు. మనోరమని అడగనూలేదు. దానిమాటే తలచలేదు.

మనోరమ ఆరాటం తీరలేదు. ఆఉత్తరంలో ఏముందో తెలుసుకోటానికి తగినంత ఇంగ్లీషు తనకిరాదు. చదవాలని ప్రయత్నించినా, విఫలమైపోయింది. ఏమున్నప్పటికీ తన జీవితంలోని అశాంతికీ, దుఃఖానికీ ఆ ఉత్తరంరాసిన వ్యక్తే కారణమన్న అభిప్రాయం రోజురోజుకీ బలపడుతుంది. అది తన ప్రబల శత్రువుని జ్ఞాపకంచేసే వుత్తరమైనప్పటికీ మనోరమ దాన్ని యెంతో జాగర్తగా దాచింది. ఈ చీకటిని అదే పటా పంచలు చేస్తుందనీ, ఈ చిక్కుని అదే విడదీస్తుందని మనోరమ గట్టినమ్మకం. అందుకే వుత్తరాన్ని ఎంతో పదిలంగాదాస్తోంది.

ఆకాశమంతా వెన్నెలతో నిండితొణుకుతుంది. అక్క డక్కడ చెదురుగా నిలిచివున్న మబ్బులుకూడా ఆ వెన్నెలలో కలసిపోయి, కరిగిపోయి వెండి వెలుగులువెదజల్లుతున్నయ్.

ఎంత రాత్రి అయిందో తెలియదు. పని అంతా అయి నాక వంటయింట్లో పక్కపరుచుకుని నిద్రకోసం యెంతో తపస్సుచేసి విసుగుపోయింది. తనవంటి దీనురాలికి, నిర్భా గ్యురాలికి, నిద్రకూడా దూరమైతే ఇంకేముంది ? తనకి వేరే సుఖమేముంది ? ఓదార్పు ఏముంది ?

ఇంకెంతకాలం తన జీవితం యిల్లా నీరసంగా నిస్సారంగా గడచిపోవాలో? ఇంకెంతకాలం తను జీవితనాటకంలో మూగనీడగా నిలబడివుండాలో? ఈ జీవితమే ఒక చీకటి కోణం, నాలుగు దిక్కులూ గోడలుగా, లోకమే ఒక దారుణమైన కారాగారంగా గోచరిస్తోంది. తనకిక విముక్తియెప్పుడు?

నిజానికి తను అనూరాధని నిందించవలసిన పనేముంది? ఆమె యెవరో తెలియదు. అనవసరమైన విరోధం పెంచుకుని తన మనసులో క్షోభపడటం యెందుకు? ఎవరీ అనూరాధ, ఆమెకీ మీకూ యేమిటి సంబంధం అని సూటిగా భర్తని అడగటానికి మనసొప్పదు. ధైర్యంచాలదు. అనూరాధ యెవరైనప్పటికీ ఆమెని తను నిందించవలసిన పనేముంది?

అవును, తను యెవరినీ నిందించవలసిన పనిలేదు. నిందించినా యెవరినని నిందిస్తుంది? తల్లి దండ్రులనా? వాళ్లు చేసిందేముంది? వాళ్ళవిధి వాళ్ళు నెరవేర్చారు. తను సుఖపడుతుందని కొండంత ఆశతో పెళ్ళిచేశారు. అంతకంటె ఇంకో తల్లిదండ్రులు మాత్రంయేం చేస్తారు? అక్కడికి వాళ్లు యెంతో అండగానిలిచి ఆదుకుంటూ వుండబట్టే తన బతుకు ఈ మాత్రంగానైనా వెళ్ళమారిపోతుంది.

కాదు, తనకి అన్యాయంచేసింది తన భర్తే, డబ్బు కోసంకాకపోతే తనని యెందుకు పెళ్ళాడటానికిఅంగీకరించాడు. పెళ్ళాడినవాడు తనని యీ విధంగా యెందుకు యేవగించుకోవాలి? తను తెచ్చిపెట్టే డబ్బుకి మాత్రమే అతను విలువ యిస్తున్నాడు. తనని ఒక పురుగులాగా దులపనిస్తున్నాడు. తన జీవితాన్నంతనీ నాశనంచేశాడు. తన సుఖాన్నంతనీ ధ్వంసం

చేశాడు. తనని యావజ్జీవమూ ఒక వెలుతురులేని, గాలిలేని చెరసాలలోకి విసిరేశాడు. అతనే కారకుడు. అతనిదే మోసం. అతనిదే వంచన. తన జీవితాన్ని ఒక నరక కూపంగా చేసి వేసింది అతనే.

తనకీ హృదయముంది. తనకీ ఆశలున్నయ్. తనకీ జీవితంలో వెన్నెలనిచూడాలని ఆరాటముంది. ఈ మాత్రం గ్రహించలేదా అతనిహృదయం ? తోటి జీవిమీద చూపవలసిన దయనికూడా చూపలేని రాతిమనిషి, తనని పెళ్ళాడమని యెవరు బలవంతపెట్టారు ? అందరిమాదిరిగా తనూ ఎందుకు నిరాకరించకపోవాలి. కేవలం డబ్బుకోసమే. కేవలం డబ్బువల్ల తనజీవితాశలని నెరవేర్చుకోటంకోసం తన ఆశల సాఫల్యం కోసం భార్యజీవితాన్ని, సుఖాన్ని బలియివ్వటానికి వెనుదీయనంత స్వార్థపరుడు. నిజంగా అతనే తనజీవితాన్ని తెల్లవారని చీకటిరాత్రి చేసివేశాడు.

కాదు. అతన్ని అనవలసిన పనిలేదు. అతను తనను భార్యగా స్వీకరించటంకంటె యింకేం వుపకారంచేయాలి? లేకపోతే యీపాటికి తను సమాజంలో యెంత దారుణమైన అగౌరవాలకి గురిఅయ్యేదో ? లోకులకి తన జీవితమొక కాలక్షేపమయిపోయేది. వారికి తనొక ఆటవస్తువయిపోయేది. నిజంగా నిత్యానందం తనని వుద్ధరించాడు. తనతోపాటుఅతనూ జీవితంలో కష్టపడుతున్నాడు. తనకి అందనిసుఖం అతను మాత్రం యేం పొందుతున్నాడు ?

తనకి ఒకరిని అనే అధికారంలేదు. తనదుఃఖానికి ఒకరినెత్తిన బాధ్యతవేయటంవల్ల తనకి కలసివచ్చేదిలేదు. తను

అన్నిటినీ భరించాల్సిందే. నోరు మెదపకుండా అన్నిటినీ సహించాల్సిందే.

కాని సహించగలనా ? ఈ విధంగా కాలం వెళ్ళదీయ గలనా? ఈ మితిమీరిన బరువును మోయగలనా? అనే మనోరమ సందేహం. మరీ దుస్సహంగా తోచినప్పుడు మనోరమ కన్నీళ్ళతో విధిని దీనంగా వేడుకునేది. "ఇంకెంతకాలం నాకీ విషమపరీక్ష ?" అని—ఆమె హృదయం భగభగ రగిలింది. "ప్రభూ ! ఈ అందవికారిని యెందుకు జన్మెత్తించావు ?" అంటూ కన్నీళ్ళతో ప్రశ్నించింది. మారులేని ఈ ప్రశ్నతో ఆమె మనస్సంతా దహించిపోయింది. పక్కమీద లేచి కూచుంది. ఇంకా భర్తగదిలో దీపం వెలుగుతోంది. అతను ఇంకా చదువుకుంటూనే వున్నాడేమో ? గది గడపదగ్గరకి మెల్లిగా వెళ్ళి లోపలికి తొంగిచూచింది. చదివి చదివి పుస్తకం మీదే తలవాల్చి కుర్చీలోనే నిత్యానందం నిద్రపోతున్నాడు. అతన్ని చూడగానే యెందుకో మనోరమకి జాలివేసింది. ఇతరుల సుఖంసంగతి ఎంత ఆలోచించడో తన సుఖంకూడా అంత మనసుకి పట్టించుకోడు. యెప్పుడూ చదువు; ఒక్కటే చదువు. మెల్లిగా దగ్గరికివెళ్ళి తలకింద పుస్తకంతీసి దిండుపెట్టింది. దీపం తగ్గించి గదిబైటికి మెదలకుండా వచ్చేసింది.

ఎవరితోనూ తనకి విరోధంలేదు. ఎవరిమీదా తనకి కోపంలేదు. అనురాధమీద ఎందుకు తనకీ అర్థంలేని మాత్సర్యం ? ఆమెమీద ఎందుకు తెలియని అసూయ? ఆమె తనభర్తకి బంధువుకావచ్చు. స్నేహితురాలు కావచ్చు. ప్రియురాలే కావచ్చు. అయినా తనకెందుకీ విరోధం? ఎంత

ధన్యురాలో ఈ అనురాధ! ఎంత అదృష్టవంతురాలో! ఏ ఇంద్రజాలంతో తనభర్తని వశం చేసుకుందో? ఏ మంత్ర శక్తితో అతని హృదయాన్ని జయించిందో?

పోనుపోను అనూరాధని తలుచుకున్నప్పుడు మనోరమకి అసూయా కోపమూ విరోధమూ కలగటంలేదు. అపరిచితురాలైన ఈ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలం మాత్రం నానాటికీ మిక్కుటమైపోతోంది.

ఆ ఉత్తరం దాచటంవల్ల తన క్షోభతప్ప కలిగిన లాభ మేముంది? ఆ ఉత్తరాన్ని దొంగచాటుగా తను తేవటంలో తనకే వెలితి కలిగిందిగాని భర్త తోణక లేదు. దాన్ని సూటిగా భర్తకివ్వటానికి ధైర్యంలేదు. ఆ ఉత్తరాన్ని భర్త ఇంట్లో లేని సమయంలో తీసుకెళ్ళి పుస్తకాలమధ్య పెట్టి రావాలి. అప్పటికి ఆమె మనసు కుదుటపడదు. అప్పటిదాకా ఆమె మనసు దొంగతనం చేసినట్లుగా చిన్నబోతూనే వుంటుంది. అప్పటిదాకా ఆ ఉత్తరం అయోమయమైన అవ్యక్తమైన బాధతో గుండెల్లో గుచ్చుతూనే వుంటుంది. అప్పటిదాకా ఆ ఉత్తరం మనోరమ మనసుని నిద్రపోనివ్వదు.

అందుకనే భర్త ఇంట్లోలేని సమయంలో మనోరమ గదిలోకి వెళ్ళింది. ఆ ఉత్తరం మునుపు ఎక్కడ దొరికిందో అక్కడే పడేసివద్దామనుకుంది. ఆ ఉత్తరాన్ని తను తీసి దాచినట్లు భర్తకి తెలియదనీ మనోరమ నిశ్చయించుకుంది. ఎన్నో సార్లు సూటిగా ఆ ఉత్తరాన్ని భర్తకే ఇవ్వాలనుకుంది. కాని ధైర్యం లేకపోయింది. చివరికి భర్త ఇంట్లోలేనిసమయంలో

ఆ ఉత్తరాన్ని పుస్తకంలో పడేసి రావాలని నిశ్చయించుకుంది.

ఉత్తరం బల్లమీద పెట్టిందో లేదో తలుపు కొట్టిన చప్పుడు, భర్త ఇవాళ ఇంత దబ్బున ఎందుకు ఇంటికి తిరిగి వస్తున్నాడో? తను ఉత్తరం తొందరలో పుస్తకంలోనైనా దాచలేదు. బల్లమీదే పడేసింది. ఇప్పుడు తను పట్టుపడిపోతే? పోనీ ఉత్తరాన్ని తనదగ్గరే వుంచుకుంటే? అవును. ఇంకో రోజున గదిలో పడెయ్యవచ్చు. ఇప్పుడు భర్తముందు తల వంపు తప్పుతుంది. అనుకుంటూ మనోరమ ఉత్తరాన్ని పదిలంగా దాచివచ్చి తలుపుతీసింది.

తలుపుకొట్టింది భర్తకాదు. ఎవరో అపరిచితమైన స్త్రీ. తనకి ఎక్కువగా చూచిన గుర్తులేదు. కాని ఆ స్త్రీమాత్రం తనని ఎరుగున్నట్లు చిరునవ్వుతో పలకరించింది. ఆ చిరునవ్వు చూసేసరికి మనోరమకి చిత్రంవేసింది. ఆ తెలియనివ్యక్తి ఆ తీయని చిరునవ్వుతో మొదటి క్షణంలోనే తనని జయించి వేసింది.

ఎల్లా పలకరించాలో, ఏమనిచెప్పాలో, తెలియక మనోరమ తబ్బిబ్బు పడుతూ నిలబడింది. ఆ వ్యక్తి బండివాడిని సామాను దింపమంది. లోపలికి తీసుకురమ్మంది. ఇది చూసేసరికీ మనోరమకి మరీ వింతగావుంది. నోటమాట రావటంలేదు.

ఈ తడబాటు కనిపెట్టి "నిత్యానందం ఇంట్లో లేడా?" అని అడిగింది ఆ వచ్చిన యువతి. మనోరమ ఒక్కసారి ఎదుటి యువతిని అపాదమస్తకమూ చూచింది. వొంకెలు తిరిగి గాలిలో లీలగా తేలిఆడుతున్న నొక్కులజుట్టు మొదలుకొని

శ్వేతగులాబులని గుర్తుకు తెస్తూన్న పాదాలవరకూ క్షణంసేపు చూసింది. తెలియకుండానే ఆమెమనసు "అనూరాధయేమో!" అంటోంది.

మనోరమ ఎంతో ప్రయత్నంమీద 'ఇంట్లోలేరు. లైబ్రరీకి వెళ్ళారు' అంది. "అయితే నామాట మరిచేపోయాడు. నేను వస్తానని కూడా చెప్పలేదా? బలేమనిషి. ఎప్పుడూ ఒకటే తీరు" అంది. ఈమాట వినేసరికి మనోరమకి ఈమె తప్పకుండా అనూరాధ అయివుంటుందని రూఢిగా తోచింది. కాని మరెవరు? ఎక్కడనుంచి వచ్చారు? ఏం పనిమీద వచ్చారు? అని మోటుగా అడగపుట్టలేదు. "లోపలికిరండి. కూచోండి వస్తారు. వచ్చే వేళయింది" అంది మనోరమ.

మనోరమని చూసిచూడటంతోటే అనురాధ విస్తుపోయింది. ముందు నిత్యానందం ఇంటిదాసీ అనుకుంది. కాని నిత్యానందాన్ని గురించి తను మాట్లాడుతున్నప్పుడు మనోరమ ముఖంలో కనబడిన సంచలనాన్నిబట్టి ఈమె అతనిభార్య అనుకుంది. ఒక క్షణంసేపుమాత్రం ఇటువంటి అందవికారి నిత్యానందానికి భార్యకావటమేమిటి అని మనసు చివుక్కుమంది.

మనోరమ మర్యాదచేసేసరికీ అనూరాధమనసు తెలియకుండానే కరిగిపోయింది. అమాయకమైనచూపు, మర్మంలేని మాటతీరూ చూసేసరికీ అనూరాధ తెలియకుండానే మనోరమ అందవికారాన్ని మరచిపోయింది. "అయితే నేనెవరో చెప్పుకోగలవా అక్కా" అంది అనూరాధ. మనోరమ ఎటుచెప్పటానికి పాలుపోక బిక్కముఖం వేసింది. ఇదిచూసి అనురాధ అడిగింది "నిత్యానందం నా సంగతి ఎప్పుడూ నీతో చెప్పలేదా ?" అని.

"లేదు" అంది మనోరమ. వినగానే అనూరాధకి ఆశ్చర్యం వేసింది. తను వస్తున్నట్లు తెలిసికూడా భార్యకు చెప్పలేదు. రెండేళ్ళనుంచీ కాపురం చేస్తున్నా ఒక్కసారికూడా తనసంగతి భార్యతో ప్రస్తావించలేదు. చాలా చిత్రంగావుంది. ఇటువంటి అమాయకురాలికి తెలుపకుండా నిత్యానందం తన సంగతి ఎందుకుదాచాలి? తెలుపవలసిన అవసరం వచ్చినప్పుడుకూడా ఎందుకు తెలుపకపోవాలి?

తనంతట తను తనసంగతి చెప్పుకోటానికి అనూరాధకి సిగ్గువేసింది. తన భర్తనిగురించి ఇంత చనువుతో, ఇంత అనుభవంతో మాట్లాడేమనిషి అనూరాధకాక మరెవరు? చూసిన క్షణంలోనే శరత్కాలపు వెన్నెల చలువతో ఎదుటి మనసుని మంత్రించి వేయగల ఈ రూపసి అనూరాధకాక మరెవరు? మనోరమకి అడగవలసిన అవసరమే కనిపించలేదు.

ఆ ఇంట్లో మనోరమ కొన్నిగంటలు మాత్రమేవుంది. అయినప్పటికీ ఎన్నోఏళ్ళు అక్కడవున్నట్లనిపించింది. ఏదో తెలియని బరువుతో ఆమెమనసు కుంగిపోతోంది.

నిత్యానందం ఎందుకిటువంటి అన్యాయానికి పాల్పడ్డాడు? తన స్వార్థవాంఛల సాఫల్యంకోసం మనసులేని పెళ్ళికి ఎందుకు ఒప్పుకోవాలి? ఇంత స్వార్థపరత్వం అతనిలో వుందని ఇదివరకెప్పుడూ తను గ్రహించలేదు. పెళ్ళిచేసుకోకుండా ఉండాలిసింది. చేసుకున్నతరువాత ఏమీ ఎరుగని, నిరపరాధిని మనోరమని ఈ విధమైన చిత్రవధకి ఎందుకు గురిచేయాలి? మనుషుల హృదయాలతోనూ జీవితాలతోనూ విలాసంగా ఆటలాడటం ఎంత దారుణం! కేవలం తన దారిద్ర్యాన్ని దాటి బైట

పడటానికి మనోరమని ఒక తెప్పగా ఉపయోగించుకొంటున్నాడు. తన తీరని ఆశలని సఫలంచేసే ధనరాశిగా ఆమెని వినియోగిస్తున్నాడు. ఇంత హృదయంలేని పని నిత్యానందం ఎల్లా చెయ్యగలుగుతున్నాడో అనురాధకి తెలియకుండావుంది. ఎంత తరచిచూచినా నిత్యానందం నిర్దోషి అనటానికి అనురాధకి ఆధారం కనబడటంలేదు.

కాని నిత్యానందంమాత్రం జీవితంలోని మాధుర్యానికి, సుఖానికీ దూరమైపోలేదా? అతను తననితాను హింసించుకోవటం లేదా?

కావచ్చును. అతనికి తననితాను హింసించుకునే హక్కుంది. తనకి డాక్టరు డిగ్రీమీద అంత మక్కువ వుండవచ్చును. ఇంకే ఇతరసుఖాన్నీ, ఆనందాన్నీ ఆపేక్షించక పోవచ్చును.

కాని ఈ ఎగుడుదిగుడు రాళ్ళదారిలో తన జీవితశకటానికి ఒక నిరపరాధియైన నిర్భాగ్యజీవిని కట్టి బలవంతాన ఈడ్చుకుపోవటానికి నిత్యానందానికి అధికారం ఎక్కడిది?

తనబతుకు మంటలుమండే ఇసక ఎడారి కావచ్చును. కాని మనోరమ జీవితాశలన్నీ కాల్చివేసి, ఆమె జీవిత వసంతంలో గ్రీష్మజ్వాలలని రగిల్చి, నిస్సారంగా చేయటానికి అతనికేమాత్రమూ అధికారం లేదు. మనోరమ ఏం తప్పు చేసిందని ఆమెకీ ఘోరశిక్ష విధిస్తున్నాడు? ఆమె అందకత్తె కాదని తెలిసికూడా పెళ్ళిచేసుకోవటానికి ఎందుకు ఒప్పుకోవాలి? ఒప్పుకున్నవాడు మనోరమని తన హృదయమధ్యానికి రానీకుండా, బైట ద్వారందగ్గరే తలపుతట్టుతూ ఎందుకు నిల

పెట్టాలి. ఎంత ప్రయత్నించినా అనూరాధ నిత్యానందాన్ని క్షమించలేకపోతోంది.

ఆ ఉన్న కొన్ని గంటల్లోనూ మనోరమతో ఎక్కువ మాట్లాడలేదు. మనోరమది అంత పూసుకునితిరిగే స్వభావం కాదు. అయినప్పటికీ ఎందుకో ఆమెవేపుకే అనురాధ సాను భూతి అంతా మొగ్గుతోంది. అనురాధకి మనోరమ ఆప్తులుగా, పూర్వసంబంధమున్నట్లుగా అనిపిస్తోంది. మనోరమ మనోభావ మంతా తను పంచుకోగలిగింది. ఆ బరువుతోడనే అనురాధకి అక్కడ వున్న గంటలు యుగాలుగా తోచినయ్.

తను అక్కడి కెందుకు రావాలి? అక్కడ దిగకుండా సరాసరి వెళ్ళిపోవాల్సింది. వెంటనే రైలులేకపోతే రైల్వే వెయిటింగురూములోనే వుండిపోవాల్సింది. భర్త తనతో చెప్పకుండా సీమకి వెళ్ళిపోయినప్పుడు అనూరాధ ఎంతో బాధ పడింది. కాని భర్త గదిలోకి అడుగుపెట్టటానికి కూడా జంకు తున్న మనోరమ వ్యధని చూసేసరికీ అనూరాధకి అంతకు మించిన బాధకలిగింది. ఆ రాత్రి వంటయింట్లో చాపపరుచు కుని దాసీలాగా నిద్రపోయిన మనోరమని తలుచుకుంటే అనూ రాధ గుండె మండిపోతోంది. భర్త తనమాటమరచి సీమలో ఒక దొరసానిని పెళ్ళిచేసుకున్నాడని విన్నప్పుడు కూడా అనూ రాధకి అంత వేదన కలగలేదు.

ఇక్కడికి రాకుండావుంటే బాగుండును అనుకుంది మొదట. కాని అంతటి నీ బాధ్యత తీరిపోతుందనుకున్నావా? నిత్యానందం హృదయంలో నిత్యమూవుండే నీకు అతని ఇంటికి

వచ్చినందుకు పరితాపమెందుకు ? అని సూటిగా అడిగింది అనూరాధ మనసు. అక్కడనే మండటంవల్లనే మరొక నిర్దోషి తన పదవిని కోల్పోతున్నదని నేనిదివరకు ఎరుగను. నేను తప్పుకుంటే ఆమెకి ఆమెస్థానం లభిస్తుందంటే అంతకంటె నాకేం కావాలి? విధి నన్నూ నిత్యానందాన్ని విడదీసి ఎడంగా విసిరేసింది. అయినా నేను ఇంతకాలమూ అతనికి దూరం కాలేకపోయాను. ఇప్పుడిక క్షణంకూడా ఆలస్యం చెయ్యను. విధి శాసనాన్ని పాలిస్తాను. దూరంగా తొలగిపోతాను. ఆ విధంగానైనా మనోరమలాంటి నిర్భాగ్యురాలికి సాయపడతాను అనుకోసాగింది అనూరాధ.

కాని నిత్యానందాన్ని తలుచుకుంటే అనురాధకి జాలి వేసింది. తను అతని భార్యకాలేకపోయింది. ధనమనే ఇనప సంకెళ్ళు తనని అథఃపాతాళానికి ఈడ్చుకు పోయినయ్. ఆ దరీ తెన్నూ లేని అంధకారం నుంచి బైటపడగలవనే ఆశ కూడా లేదు.

అతనుకూడా చివరికి ఆధన పిశాచికే తన జీవితాన్ని, సుఖాన్నీ అర్పించివేశాడు. తమరిద్దరూ బందీలు, కటకటాల వెనక నిలబడి ఒకరికేసి ఒకరు జాలిగా దాగుచూపులతో కాలంగడుపుతున్నారు.

తమరిద్దరికంటె మనోరమదే దురదృష్టం. భర్తచేత జీవంలేని, హృదయంలేని బొమ్మగా చూడబడటంకంటె ఇంకే దురదృష్టంకావాలి? అయినప్పటికీ భర్త సుఖంకోసం అంతగా పరితపించే ప్రాణి ఎవరుంటారు ?

విధివలలో తమతోపాటుపాటు ఏమీ ఎరుగని మనో రమకూడా ఎందుకు చిక్కుకుపోవాలి? సరంగులేని పడవల్లాగా తమ ముగ్గురూ ఈ జీవితంలో ఎక్కడికి తేలిపోతారో తెలియ టంలేదు! తమ ముగ్గురినీ చదరంగపు పావులుగాచేసే విధి ఈ జూదంలో ఎటువంటి ఎత్తులు వేస్తుందో తెలియటంలేదు.

"వెళ్ళి వస్తా అక్కా" అని బండి ఎక్కుతూ మనోరమ కేసి చూస్తుంటే అనూరాధకి కన్నీరు ఆగలేదు. ముఖంతిప్పేసు కుంది. సాగనంపటానికి వచ్చిన నిత్యానందం మౌనంగా నిల బడి అనూరాధ కన్నీళ్లు చూసి చకితుడయ్యాడు.

ఈ వీడ్కోలు ఎందుకో మరీ బరువుగా తోచింది. మళ్ళా అనూరాధని చూస్తానాఅన్న సందేహం ఎందుకో తెలియకుం డానే అతన్ని వణికించి సాగింది. మనోరమకి మాత్రం అనూ రాధ వెళ్తుంటే తన పంచప్రాణాలూ ఎగిరిపోతున్నట్లనిపించింది. కొన్నిగంటల్లోనే అనూరాధ అంత ఆప్తురాలై పోయింది.

* * *

భర్త సీమలో పెళ్ళిచేసుకున్నాడని విన్న క్షణాలో అనూరాధ ఆశలన్నీ నేలకూలినై. అదే దిగులుతో ఆమె కుమిలిపోలేదు. ఎందుకంటే ఆమె భర్తతో సుఖపడిన రోజు ఒక్కటీలేదు. కష్టాలలోనే ఆమె పెరిగింది. అందుకనే ఇంత అకస్మికమైనవార్త వినికూడా తట్టుకో కలిగింది.

పెళ్ళినాటికి అనూరాధ కాలేజీలో మొదటి సంవత్స రంలో వుంది. చదువుతూ మధ్యలో మానివేసింది. ఇప్పుడు మళ్ళీ చదువుకోవాలని కోరికపుట్టింది. తల్లిదండ్రులని

ఒప్పించింది. కాలేజిలో చేరాలని వెళ్తూనే దారిలో నిత్యా నందం ఇంట్లో దిగింది.

చదువులో చేరినదగ్గరనుంచీ అనూరాధకి గడిచిపోయిన జీవితమంతా కథగా కలగా కనిపించసాగింది. తన జీవితం భగ్నంఅయింది. కాని తనకి లోకంలో స్థానంవుంది. ఎప్పుడు జీవితం భీకరమైన శూన్యంగా కనబడటంలేదు. ఇప్పుడు తన జీవితానికీ గమ్యమొకటి ఏర్పడింది. ప్రయోజనముంది. తన లాటి భగ్నజీవులతో కూడా లోకానికి అవసరముంది.

తన ప్రణయజీవితమంతా భగ్నస్వప్నం. తన సాంసారిక జీవనం దారుణమైన విషాధగాథ. ఈ రెండు రంగాలలోనూ తను ఓడిపోయింది. ఈ రెండురంగాలలోనూ అనూరాధకి మోయలేని విషాదమే మిగిలింది.

కాని తను పూర్తిగా ఓడిపోలేదు, తనని ఎవరూ ఓడించలేరు. తన జీవితం శూన్యంకాదు. ఈ జీవిత సమరంలో నిలబడి, పోరాడేటందుకు తన చేతిలో ఇంకెన్నో ఆయుధా లున్నాయ్. తనకి మునుపు అణిగిపోయి కనబడకుండా దాగిన శక్తులు ఒక్కొక్కటే మేల్కొని అనూరాధ హృదయంలో ఆశలు వెలిగిస్తున్నయ్.

ఇప్పుడు అనూరాధకి తన భగ్నజీవితాన్ని తలచుకుని కుమిలిపోతూ వనాలకు కూచోవటం పిరికి తనమనిపిస్తోంది. తనకు దుఃఖాన్ని మరిపించివేసే ఆర్తి, దైన్యం, దుఃఖం అనూరాధ చూపులని ఆకర్షించినయ్. తన సానుభూతికోసం విలపిస్తూ పిలిచే విశాల ప్రపంచంలోకి దుమికింది. తన చదు

వునీ, తన తల్లిదండ్రుల ధనాన్ని, తనశక్తినీ, తన సర్వస్వాన్నీ అనూరాధ సంతోషంతో సమర్పణ చేయటానికి సిద్ధపడింది. ఇప్పుడు తనని ఎవరూ ఓడించలేరనే ధైర్యం క్షణక్షణమూ అనూరాధని ముందడుగు వేయిస్తోంది.

నిత్యానందం ఎన్నో ఉత్తరాలు రాశాడు. కాని అనూరాధ ఒక్కదానికీ జవాబు రాయలేదు. కాని మనోహర తలచుకోని రోజులేదు.

* * *

అనూరాధ వెళ్ళిపోయినదగ్గరనుంచీ నిత్యానందం మనసులో ఒకటే అశాంతీ, ఆందోళనా, తనతో మాట్లాడినంతసేపు అనూరాధ తనమీదికి పదునైన బాణాలు వదులుతూనే వుంది. నువ్వు ఇంత స్వార్థపరుడవని ఇప్పుడే తెలుసుకుంటున్నానని సూటిగా అంది. అన్నింటికంటే మించినదెబ్బ తన ఉత్తరాలకి జవాబు రాయకపోవటం.

తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాడు. తనని చిన్నప్పటినుంచీ ఎరిగిన అనూరాధే స్వార్థపరుడుగా తేల్చి వేసింది. ఆమెకంటె సానుభూతితో తనని విచారణ ఎవరు చేస్తారు? ఆమె నోటివెంటనే ఇంత కఠినమైన తీర్పు విన వచ్చింది. ఇకలోకం తనని ఎంత చీల్చి చెండాడుతుందో! ఎంత నిర్దయగా తనమీద దాడి వెడలుతుందో!

అవును, అనూరాధ అన్నదాంట్లో అబద్ధమేముంది! ఎంత దారుణమైనస్వార్థం? ఎంత దాక్షిణ్యంలేని స్వార్థం? తోటిజీవిని తృణప్రాయంగా పరిగణించి తనకోసం బలికోరే దయలేని స్వార్థం!

లోకం మాట అటుంచి తన కళ్ళకే తను ఎంతో నీచు డుగా కనిపిస్తున్నాడు. తనని తనే క్షమించుకోలేక పోతున్నాడు!

పెళ్ళికి తను ఎందుకు ఒప్పుకోవాలి! ముందు మనో రమని చూసి నిరాకరిస్తే ఎంతబాగుండేది? ఆమెని చూడ కుండా ఆమె తల్లిదండ్రుల భాగ్యానికి మురిసిపోయి మనోరమని పెళ్ళాడటానికి ఒప్పుకున్నాడు. తనకి గగనకుసుమంగా కనిపిం చిన డాక్టరు డిగ్రీని అందుకోటానికి మనోరమని, ఆమె ధనాన్నీ కేవలం నిచ్చెనగా ఉపయోగించుకున్నాడు తన మితి మీరిన స్వార్థం ఆమె జీవితాన్ని కేవలం ఒక ఆటవస్తువుగా వినియోగించుకుంటోంది.

కాని ఒక్కనాడైనా మనోరమ నోరుత్తి తనని నిందించ లేదు. ఒక్కనాడైనా మనోరమ భార్యకి సహజమైన అధి కారంకోసం తనతో పోట్లాడలేదు.

తలచుకున్న కొద్దీ మనోరమ ముందు తానొక క్షుద్రుడి లాగా కనిపిస్తున్నాడు. ఎందుకో ఆమె ముఖం కనిపించినప్పు డల్లా తన ప్రాణం సిగ్గుతో తల ఎత్తలేకపోతోంది. ఆమె తన కేసి చూస్తేచాలు నిత్యానందం నిలువునా కంపించిపోతాడు. క్షమించరాని అతని నేరం నిత్యానందాన్ని పాతాళానికి తొక్కివేస్తుంది.

కాని ఏమిటిచేయటం? జీవితంలో ఒకసారి తప్పటడుగు వేశాడు. దానిఫలితాన్ని తనతోపాటు మనోరమకూడా అనుభవిస్తోంది. ఇప్పుడు తను ఏంచెయ్యగలడు? ఏవిధంగా అతని జీవితం దారికివస్తుంది? ఈ పెడదారిని బట్టి తనతోపాటు

మనోరమనికూడా దిక్కు తెలియని గమ్యం లేని శూన్యంలోకి ఈడ్చుకు పోవలసిందేనా?

అనూరాధ అపురూప సౌందర్యానికి అంకితమైన తన హృదయంలో ఈ కురూపి మనోరమకి చోటివ్వ గలడా? అనూరాధ తనకి దూరమై పోవాలని ప్రయత్నిస్తుంది. కాని తనుమాత్రం అనూరాధని దూరంగా తరిమి వేయగలడు? ఆమె దూరం కావాలని ఎంత ప్రయత్నించినా, నిత్యానందం మాత్రం తన శూన్య దేవాలయంలో మరొక దేవమూర్తిని ప్రతిష్ఠించలేడూ?

అయినప్పటికీ ఒక విషయం తలుచుకొని నిత్యానందం పొంగి పోతాడు. అనూరాధ కూడా క్షమించలేని తనని క్షమించినజీవి, జగత్తులో ఒక్కత్తేవుంది. ఆమెని గౌరవిస్తాడు. ఆమె పాదాలని పూజిస్తాడు. ఆమెని అనూరాధ స్థానంలో కూచోబెట్టి ప్రణయ మూర్తిగా ఆరాధించటంమాత్రం నిత్యానందం చెయ్యలేడు. ఎంత ప్రయత్నించినా అది అతనికి సాధ్యం కాదనిపిస్తోంది.

అనూరాధ వెళ్ళిన దగ్గరనుంచీ మనోరమకి తనమీద తనకి మితిలేని రోతకలుగుతోంది. తను ఈలోకంలో ఎందుకు పుట్టాలి? తనవంటి కురూపిని సృష్టించి విధి నిత్యానందం జీవితాన్ని ఎందుకిలా నాశనం చెయ్యాలి? తనని అతని భార్యగా అంటగట్టి అతని మనసుని జయించిన అనూరాధని ఎందుకు దూరం చెయ్యాలి?

నిజంగా అనూరాధే అతనికి భార్య అయితే వాళ్ళ

జీవితం ఎంత అద్భుతంగా గడిచేదో! ఈడు జోడు, చదువు, అందం అన్నిటిలోనూ దీటయిన 'ఈ జంటనిచూసి దేవతలు కూడా అసూయ' పడివుండేవాళ్ళు.

కాని ఈవిధంగా ఎందుకుజరిగింది? తన మూలంగా భర్త జీవితం ఎందుకిలా శిథిలమైపోయింది?

అనూరాధ ఆక్రమించిన భర్త హృదయంలో చొర బడాలి అని తను ప్రయత్నించటం ఎంత అన్యాయం? ఆమెకీ తనకీ అందంలోకాని, చదువులోగాని పోలికేవుంది? మరిఅటువంటి తనని నిత్యానందం భార్యగా ఎందుకు స్వీకరించాలి? అందరి లాగే అతనూ తోసివేస్తే తన బతుకు ఏమైపోయేదో? అప్పుడు తనవల్ల ఇంకోరికి యావజ్జీవితమూ ఇటువంటి అశాంతి కలిగేది కాదు. అప్పుడు తన బతుకు కొరగానిదయినా దానివల్ల ఎవ రికీ చెరుపు కలిగేది కాదు. కాని విధి ఈ విధంగా తననెందుకు నిత్యానందం జీవితంలోకి— విసిరివేసింది?

తెలుసుకున్నకొద్దీ మనోరమ భర్తమీద ఏవిధమైన నేరమూ మోపలేక పోతోంది. అతని జీవితాన్ని అడవిని కాసిన వెన్నెల చేసిన తనకి అతన్నినిందించే అర్హత, దండించే అర్హత ఎక్కడిది? తను అతనికి లేశమైనా సుఖం కలిగించ కలిగితే చాలు. తన జీవితం తన ప్రాణం, తన ధనం, అన్నీ అతనికోసమే వినియోగిస్తుంది. అతను వాటిని స్వీకరించ టమే ఆమెకి కావలసింది. ఆమె ప్రతిఫలాన్నీ ఆపేక్షించటం లేదు. దేనినీ ఆశించినని వేదనకి మనోరమసిద్ధపడింది. అందుకే ఆమెకి జీవితంలోని ఆశాభంగమూ, దుఃఖమూ అలవాటయి

పోయినై, ఏదో తెలియని సంతృప్తి, శాంతి వచ్చి ఆమె మనసులో గూడుకట్టుకుంటున్నయ్.

పుట్టింటికి రమ్మని వచ్చిన పిలుపులెన్నో మనోరమ పెడచెవిన పెట్టింది. భర్తకి తన చేతుల్తోవండి పెట్టాలి. చిందర వందరగా పడివుండే పుస్తకాలని తనే సర్దాలి. ఒకటి తరవాత ఒకటికాల్చి పారేసిన సిగరెట్ ముక్కలన్నీ తనే ఎత్తి పారే యాలి. బూట్లకి తనే పాలిష్ వెయ్యాలి. క్షణమైనా తీరిక కోరదు. అతని సేవలోనే మనోరమ అస్తమానమూ మునిగి తేలాలని కోరుకుంటుంది.

ఇవన్నీ చూసి నిత్యానందం మరింత సిగ్గుతో మగ్గిపో తాడు—క్షణక్షణమూ తనని మనోరమ ఋణగ్రస్తుణ్ణి చేసి వేస్తూంది. ఈఋణభారంనుంచి ఎన్నటికైనా తనుబైట పడ గలడా? ఈఋణ భారంకింద పడి తను నేలకి అణగారిపోడా? తీర్చే ఉపాయముందా? తీర్చటం సాధ్యమేనా అయినా తన అపరాధాన్ని క్షమించటంతో మనోరమకి తృప్తిలేదా? తన వంటి అధముడిని అనర్హుడిని అనుక్షణమూ ఇటువంటి పరి చర్యలతో సిగ్గుపరచట మెందుకు? అనుకుంటాడు.

మనోరమ కష్టాలు ఒకనాటికీ గట్టెక్కేట్లు కనిపించలేదు ఆమె సుఖపడే రోజువస్తుందనే ఆశకూడా తల్లిదండ్రులకి లేదు, లేనివాడు, చదువున్నవాడు అని నిత్యానందానికిచ్చారు. వృద్ధి లోకి వస్తాడు. ప్రయోజకుడవుతాడు. పిల్లసుఖపడుతుంది. ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అన్నీ అడియాసలైనయ్, కాని కన్న కడుపు, కూతురు ఏం కష్టపడుతుందో అని భయం. నెలకి

వందా నిత్యానందానికి ముడుపు చెల్లించుకోక తప్పటం లేదు. చదువుకి కూడా మితివుండవద్దూ? ఏళ్ళతరబడి చదువేమిటి కూటికి వస్తుందా గుడ్డకి వస్తుందా? చదివిందేదో చాలు, ఏదో అందరిలాగా నాలుగురాళ్ళు సంపాదిస్తూ కళ్ళముందు వుండక, కాని దేశంలో దూరభారాన, ఏళ్ళతరబడి కూచుని చదవటమేమిటి? ఈ అర్థంలేని చదువువల్ల ఖజానా ఖాళీకా వటం తప్ప మనసులో తర్జన భర్జనలు పడతాడు. చివరకి పంపేడబ్బు పంపకా తప్పదు.

నిత్యానందం ఇంకొక్క పది నెలల్లో డాక్టరయిపోతాడు. చిన్నప్పటినుంచీ పొందాలని ప్రాకులాడిన గౌరవం అందుకో టానికి ఇంకెంతో వ్యవధ లేదు. పగలూ రాత్రి క్షణం విరామం లేకుండా నిత్యానందం పుస్తకాల పేజీల మధ్యనే నివాసం ఏర్పరచుకున్నాడు. పెదవుల మధ్య సిగరెట్ కాలటం, కళ్ళ ముందు పేజీలు తిరగటం, కాలం పరుగులు తీయటం, అంతే. ఇంకో ప్రపంచమే అక్కర్లేదు. కొండలలాటి పుస్తకాలు పిండి చేస్తున్నాడు. ఇక థీసిస్ రాయటం మొదలు పెట్టాలి. ప్రొఫె సర్ తొందర చేస్తున్నాడు.

ఈ నాలుగేళ్ళలోనూ నిత్యానందం కళ్ళ అద్దాలని ఎన్నోసార్లుమార్చాడు. ఏటేటా కంటిజబ్బు గబగబా ముంద డుగు వేయసాగింది. చదువు తగ్గించమని డాక్టరు చెప్పిన సల హాలు నిత్యానందం ఒక చెవితో విని రెండో చెవిలోంచి వదిలేశాడు.

కాని ఓర్పుతో చదువుతుంటే భరించలేని మంట. నీళ్లు కారటం. తల బద్దలై పోయేటంత బాధ. చూస్తుండగానే

పేజీలో అక్షరాలన్నీ అలికివేసినట్లయిపోతుంది. అంతా మసక వేస్తుంది. దట్టమైన పొగమంచు తెరలు అతని చుట్టూ అలుముకు పోతయ్. ఎందుకో చెప్పలేని భయంతో నిత్యానందం వణికిపోతాడు ఇన్ని సంవత్సరాలు తపస్సు చేసిన డాక్టరు డిగ్రీ తనచేతికి చిక్కకుండా దూరమైపోతున్నట్లనిపించి బెదరిపోతాడు. ఆమసక తెరలు తన జీవితాన్నీ, జగత్తునీ అంతటినే ఆవరించేటట్లనిపిస్తుంది. తెలియని చీకటి లోతులలోకి మునిగిపోతున్నట్లనిపిస్తుంది. తన ప్రాణ ప్రదమైన థీసిస్ పూర్తి అయేవరకూ తనని కాపాడమని దీనంగా వేడుకుంటాడు. డాక్టరు డిగ్రీ అందినట్లే చేతిదాకావచ్చి మాయలేడిలాగా చివ్వున ఎగిరి పోతున్నట్లనిపిస్తుంది. ఏదో పాడుబడిన చీకటి నూతిలోపడి రసాతలానికి అణగారి పోతున్న తనకి చేయూతనిచ్చి ఎవరు రక్షిస్తారు? అనూరాధా, మనోరమా అన్న ఆర్తధ్వనులు కంఠం పెగిలిరావు. కాని తనని ఎవరూ రక్షించరేమోననే నిస్పృహతో, నిరాశతో అతని ప్రాణం యమయాతన పడుతుంది.

అల్లాగే థీసిస్ రాయటం మొదలు పెట్టాడు. ఎల్లాగో సగంవరకూ నెట్టగలిగాడు. ఇక దుస్సాధ్యమైపోయింది. రాయనూ లేదు. రాయకుండా ఊరుకోనూ లేదు.

ఏన్నాళ్ళ కిందటో మనోరమ నిత్యానందంలో ఏదో దిగులు జొరబడిందని కనిపెట్టింది. కాని ఏమిటో తెలుసుకోలేకపోయింది. అతని ముఖంలో మునపటికాంతి కనిపించదు. ఏవో చీకటి నీడలు ముసురుకుంటున్నట్లనిపిస్తున్నది.

ధడాలున అడగటానికి భయపడింది మళ్ళీ పరికించి చూసింది. అన్నం ముందుకూచుని నిత్యానందం విస్తరిలో వున్న పదార్థాలని తడుముకోవటం గమనించింది. సంకోచం విడిచి అడిగింది. 'ఏమిటి అల్లా తడువుకుంటున్నారేమిటి ?' ఈ ప్రశ్నవిని నిత్యానందం చకితుడైపోయాడు. ఎల్లా పసి కట్టింది ? ఈమె కళ్ళకి కనబడకుండా ఏ విషయమూ దాగదా? అనుకున్నాడు." ఏమీ లేదు. కళ్ళు కొంచెం మసక వేసినై, అన్నాడు ఈ మాట వినేసరికీ మనోరమ గుండె ఆగిపోయింది. భర్త రాక్షసి చదువునిచూసి ఆమె భయపడుతునే వుంది. ఇకముందు ఏం రాసివుందో! ఈ మాదిరిగాకూడా కాలం వెళ్ళదా ?

డాక్టరు స్పష్టంగా తేల్చి చెప్పేశాడు. చాలా ముదిరి పోయిందట. ఇక చికిత్సవల్ల ప్రయోజనలేదుట. పుస్తకమనేది చూడకుండాకళ్ళకి విశ్రాంతినిస్తే కొంచెం కుదటపడవచ్చుట. లేకపోతే అసలు చూపు కనపడకుండా పోతుందట.

అదివిన్న నిమిషంలోనే నిత్యానందం మరణయాతన అనుభవించాడు. జీవితమంతా చేసిన తపస్సు ఫలించే సమయంలో ఈ ఉపద్రవం వచ్చిపడింది. ఇక తను చదవకూడదు. రాయకూడదు. తనథీసిస్ సగంలోనేఆగిపోతుంది. తన డాక్టరు డిగ్రీ ఎండమావిలాగా దూరంనుంచే తనని వెక్కిరిస్తోంది. తన సర్వస్వాన్ని బలితీసుకున్న డాక్టరు డిగ్రి తనకి అందకుండా దూరంగా పారిపోతోంది.

ఇంటికి తిరిగివచ్చి నిత్యానందం చతికిలబడిపోయాడు. తీగెలు తెగిన వీణలాగా అతనిహృదయం మూగదైపోయింది. దీపం అరిన ప్రమిదలాగా అతని జీవితం చిన్నబోయింది. కూకటివేళ్ళతో పెకలించిన పూలతీగెలలాగా అతని ఆశలన్నీ వసివాడిపోయినయ్.

ఇంటికి వచ్చిన దగ్గరనుంచీ మనోరమ పుస్తకాలన్నీ పెట్టెలలో కెక్కించడం మొదలు పెట్టింది. ఒక్క పుస్తకం గాని, ఒక్కకాగితంకాని భర్తచేతికి అందకుండా దాచివేసింది. ఇక్కడ క్షణంకూడా వుండవద్దని నిశ్చయించుకుంది. "ఏమిటి హడావిడిగా సామాను సద్దుతున్నావ్ ?" అడిగాడు భర్త.

"ఏమీలేదు ఇంటికి వెళ్ళిపోదాం. ఇక్కడ మనం వుండాల్సిన పని ఇవాళతో తీరిపోయింది. తెల్లారి బయలుదేరి వెళ్ళిపోదాం."

"ఎక్కడికి ? ఏం తొందరవచ్చింది ? ఈ మూడు నెలలూవుండి డాక్టరేటు పుచ్చుకుంటాను. అప్పటిదాకాఇక్కడే వుంటాను."

"ఇక్కడింకోక్షణంకూడా వుంటానికి వీలులేదు. మీ కళ్ళచూపుని ఆముష్టి డిగ్రీకోసం బలియిస్తారా ? వీల్లేదు. పొద్దుటికి మానాన్న వస్తాడు. ఆయన రాగానే బయలుదేరి వెళ్ళిపోవలసిందే" అంది మనోరమ ఎన్నడూ చూపని అధికారంతో.

ఈ మాటలు విని నిత్యానందం కాదని ఎదురు చెప్ప లేకపోయాడు. దీర్ఘంగా నిట్టూర్చి "ప్రాణంలేని శవాన్ని ఇంటికి చేరవేయడంకూడా ఎందుకు ?" అన్నాడు.

"ఇంతమాత్రనికేనా ?" అందిమనోరమ మందలింపుగా.

"కాక ఏముంది ? ఏందుకోసం నేను యింతదాకా బతికానో అది అందుకోలేకపోయాను. ఈ క్షణంనుంచీ నేను చచ్చినవాళ్ళలోనే లెక్క."

"ఛీ, అటువంటి మాటలనకండి. మీ కాళ్ళమీద పడతాను" అని వేడుకుంది. నిత్యానందం నిర్వీణుడైపోయి నిశ్చలంగా కూచుండి పోయాడు. తెలియకుండా అతని కళ్ళలో నీళ్లు తిరిగినయ్, ఇంతకాలమూ విధికి ఎదురీత ఈది అలసిపోయాడు. ఇక జీవితంలో ఒక్క అడుగుకూడా ముందుకు సాగే సత్తువ లేదు. తన ఆశలన్నిటినీ విధి కూల్చివేసింది. తన జీవితం ఆకులురాలి మోడయిపోయి, తుపానునెదుర్కొని బీటలు పడిపోయి వికృతరూపం పొందిన మఱ్ఱిచెట్టులాగావుంది దారినిపోయే బాటసారులందరికీ తన బతుకు జడలు విరబోసుకున్న పెనుభూతంలాగా కనిపిస్తుంది. తన కోరికలకీ విధికీ జరుగుతున్న ఎడతెగని పోరాటానికి అతని జీవితం యుద్ధభూమి. తన జీవితం ముక్తిలేని కారాగారం, అబ్బా యింకెందుకు నేను బతకటం ? అని అతని ప్రాణం బాధతో నిట్టూర్పులు విడుస్తోంది.

"మనం వెళ్ళిపోతున్నట్లు అనూరాధకి రాయినా ?" అని ధైర్యంచేసి మనోరమ అడిగింది. భర్తతో ఆమెనిగురించి ప్రసంగించటం అదే మొదటిసారి, ఈ ప్రశ్నకి నిత్యానందం ఆశ్చర్యపడ్డాడు. "రాయి. ఒకసారివచ్చి చూసిపొమ్మనికూడా రాయి" అన్నాడు. ఆ క్షణంలో మనోరమ అతని మనసులో యిదివరకుకంటె ఉన్నతమైన శిఖరం ఆరోహించింది. "కాని

ఆమె రాదేమోనని సందేహం" అన్నాడు నిత్యానందం.
"ఎందుకురాదు ?" అంది మనోరమ భర్తకంటె తనకే అనూరాధని గురించి బాగా తెలిసినట్టు !

* * * *

మనోరమకి క్షణంకూడా తీరికలేదు. భర్త కళ్ళకి కట్లు కట్టటమూ, అతన్ని క్షణమైనా విడవకుండా నీడలాగా వెన్నంటి తిరగటమూ వేళతప్పకుండా ఉపచారాలు చేయటమూ – వీటితోనే కాలంగడిచి పోతోంది.

అనూరాధ వస్తానన్ననాటికి రాకుండా రెండు వాయిదాలు వేసింది. ఒకసారి తను నడుపుతున్న ధర్మ ఆసుపత్రిలో ఎవరో బాలింతరాలికి ప్రమాదంగావుండి రాలేక పోయింది. రెండోసారి బీదపిల్లలకోసం నడుపుతున్న బడి కొత్త యింట్లో గృహప్రవేశంవల్ల రాలేకపోయింది. ఈసారి తప్పక వస్తానంది. వస్తే ఆనాడే రావాలి. నిత్యానందానికి మాత్రం వస్తుందనే నమ్మకం ఏకోశానా లేదు.

అల్లాగే జరిగింది. ఈసారికూడా అనూరాధ రాలేదు. ఆమె ఉత్తరమే వచ్చింది. ఆ ఉత్తరంలో వస్తానన్న ఆశలు పెట్టలేదు. అది తనకి చదివి వినిపించమని నిత్యానందం పట్టు పట్టాడు. మనోరమకి చదవాలనిలేదు. అనూరాధ తనని అనవసరంగా పెద్దదాన్ని చేసింది. తన నోటితో ఆ మాటలు భర్తకి చదివి వినిపించటానికి మనోరమకి ఎంతో సిగ్గుగావుంది. చదవకతప్పదులేదు. "అక్కా. నాకు రావటానికి ముఖంచెల్లటం లేదు. నేను వచ్చిచూసి సహించలేను. నేను వచ్చి చేయగలిగిందీ లేదు. నీ సంరక్షణలో వున్నప్పుడు నేను రావలసిన

అవసరమేముంది ? నీకంటె నీ భర్త క్షేమంకోసం పరితపించే వాళ్ళూ, పరిచర్యచేయగలవాళ్లూ మూడులోకాల్లోనూ లేరు..." అంటూ రాసుకుపోయింది. యమపాశాలనుంచిభర్తప్రాణాల్ని తప్పించగలిగిన సావిత్రితో తనని పోల్చింది. సిగ్గుతో మనోరమ చదవలేకపోయింది. ఆమె ముఖం కందిపోయింది.

నిత్యానందం అంతావిని గంభీరంగా అన్నాడు. "అనురాధ నిజం పలికింది. అవును, తను రావలసిన అవసరం లేదు."

"అదేమిటి మీరుకూడా అల్లా అంటారు ?" అని అడిగింది మనోరమ.

"అవును. నీకంటె నన్ను కంటికి రెప్పగా కాపాడే వాళ్ళెవరున్నారు ? నువ్వు తప్ప ఈ అధముణ్ణి, ఈ నీచుణ్ని మన్నించి యెవరు ఆదరిస్తారు ? అనూరాధకూడా క్షమించలేక పోయింది. ఇక నాకు తనముఖం చూపవద్దని నిశ్చయించుకుంది. అటువంటివాణ్ని నువ్వు క్షమించావు" అని కళ్ళకి కట్టు కడు తున్న మనోరమ చేతులని తన చేతి వేళ్ళతో నిమిరాడు. మనోరమ సిగ్గుతో తల వంచుకుంది. భర్త మాటల ధోరణి వింతగావుంది. అతను చేసిన తప్పేమిటి ? తను క్షమించట మేమిటి ? ఏమీ మాట్లాడలేక పోయింది.

నిత్యానందం మళ్ళీ అందుకున్నాడు. "నువ్వు క్షమించావు. కాని లోకం క్షమించదు, దైవం క్షమించదు."

"క్షమించవలసినంత తప్పు మీరేంచేశారు ? అనవస రంగా యెందుకు చెయ్యని తప్పులు—" అంటుంటే నిత్యా నందం మధ్యలోనే అడ్డంవచ్చి.

"నువ్వుతప్ప యెవరూ నేను మనిషినని అనలేరు. నా తప్పులకే విధి నాకీ శిక్ష వేసింది. నా ఆశలన్నీ నేలకూల్చింది, నా కళ్ళలో కారుచీకటి నింపింది. ఆ చీకటిలో మనోరమ అనే వెలుగొక్కటే మిగిలివుంది. ఆ వెలుగుతోనే తడువుకుంటూ బతుకుబాటలో అడుగు వేస్తాను."

"మీరిల్లా దిగులుపడితే ఎల్లాగు ? మీకు ఆరునెలలు తిరిగేసరికి చూపువస్తుందని డాక్టరు చెప్పటం వినలేదూ ?"

"విన్నాను, చూపురాకపోయినా నాకేమీ చింతలేదు. కళ్ళువుండికూడా నిన్ను చూడలేకపోయాను. కళ్లుపోయిన దగ్గరనుంచీ అంతటా నువ్వే, అన్ని వేళలా నిన్నే చూడగలుగుతున్నాను. నాకు కళ్లురాకపోయినా యిబ్బందిలేదు."

"ఛీ అల్లా అనబోకండి. తప్పకుండా వస్తయ్."

"రాకపోతేయేం ? నువ్వే నా కళ్లు. నువ్వే నాకళ్ళలో వెలుగు" అని మనోరమ తలని గుండెకు అదుముకున్నాడు. మనోరమ సిగ్గుతో మగ్గిపోతూ అతని పాదాలని చుట్టుకుని అంది. "అటువంటి మాటలు అనకండి. వెయ్యి దణ్ణాలు. మీకు చూపురావటంకంటె నాకేం కావాలి ? అని కన్నీరు ఆపుకోలేకపోయింది.

తన పాదాలమీద కన్నీటిబొట్లు పడటంచూసి నిత్యానందం కంపించాడు. తనచేతులతో మనోరమ తల నిమురుతూ మౌనంలో మునిగిపోయాడు. ఆమె తలచుకుంటే తన కంటి చూపునేకాదు తన ప్రాణాన్నికూడా తిరిగి సంపాదించగలదని పించింది. ఆరు నెలలు తిరక్కముందే ఆరిపోయిన వెలుగు నిత్యానందం కళ్ళలో మళ్ళీ మెరిసింది. తనంతట తను లేచి

తిరగ గలుగుతున్నాడు. భార్య ఊతలేకుండా నడవగలుగుతున్నాడు.

అందరూ మనోరమ అదృష్టానికి పొంగిపోయారు. మనోరమ మాత్రం ఆనందాన్నంతనీ హృదయంలోనే అణుచుకుని విధికి చేతులెత్తి వేలనమస్కారాలుచేసింది. నా మొర ఆలకించావు. తండ్రీ ఇక నాకు ఏకోరికాలేదు. అని ఆమె మనసు నివేదించుకుంది.

చూపు బాగా ఆనటం మొదలైన దగ్గరనుంచే నిత్యానందం చదువుకోసం వెంపరలాడటం మొదలుపెట్టాడు. కాని మనోరమ ఒక్క కాగితంముక్కైనా అతనికంట పడనిచ్చేది కాదు.

తన థీసిస్ ఎక్కడవుందో తెమ్మని భార్యని అడగాలనుకున్నాడు. కాని ఆకోరిక మనసులోవుండగానే పసిపట్టినట్లుంది. ముందుగానే మనోరమ అడిగింది. "నేనొకటి కోరుతాను, ఇస్తారా?" అంది.

"కోరుకో, ఎంతకష్టమైన కోరికైనాసరే, ఆవిధంగానైనా నీఋణం తీర్చుకోగల నేమో!"

"ఋణంలేదు, పణంలేదు, ఆమాట తీసిపారెయ్యండి, ఇప్పట్లో చదువు సంగతి తలపెట్టనని మాటయివ్వండి."

నిత్యానందం వెలవెలబోయాడు, కొంచెంసేపు తటపటాయించాడు. చివరకి "ఓ, తప్పకుండా" అన్నాడు.

ఈ సంతోషవార్తని అనూరాధకి తెలపకుండా క్షణం కూడా వుండలేక పోయింది మనోరమ, విన్నాక వచ్చి వాలకుండా క్షణంకూడా ఆగలేకపోయింది అనూరాధ.

"వచ్చావా, రాధా యిక నాకు నీముఖం చూసే భాగ్యం లేదనుకున్నాను. కాని మీఅక్క పోయినకళ్ళకి చూపు తెప్పించింది." అన్నాడు. నిత్యానందం ఆనందంతో పొంగి పోతూ.

కాఫీ తెచ్చి యిద్దరిముందూ పెట్టిభర్త మాటలువిని తలవంచుకుంది మనోరమ. అనూరాధ కాఫీ అందుకుంటూ "అక్కా చూశావా, మీఆయన కూడా నేనన్నమాటే అంటు న్నాడు" అంది.

"నువ్వేమన్నావు రాధా?" అని నిత్యానందం కుతూ హలంతో అడిగాడు, "యమపాశాలలోంచి భర్త ప్రాణాలు గెలిచి తెచ్చుకున్న సావిత్రిలాంటిది అక్క, అన్నాడు. ఏమం టావు?"

"నిజం చెప్పావు, కొత్త కళ్ళతోపాటు కొత్తచూపును కూడా దానంచేసింది. జన్మజన్మాలకీ తీరని ఋణభారం నానెత్తినవేసి తమాషా చూస్తోంది."

ఇక సహించలేక పోయింది మనోరమ, "ఒకరితో ఒకరు పందెంవేసుకుని నన్ను అవమానిస్తున్నారా? ఇల్లా మాట్లాడితే నేను క్షణంకూడా ఇక్కడ నిలుచోలేను" అని గబగబా వెళ్ళిపోయింది.

"అక్కా, నన్ను క్షమించు; రా కూచో, వెళ్ళిపో వలసింది నువ్వు కాదు నేను" అంది అనూరాధ. మనోరమ అనూరాధ చేతులుపుచ్చుకుని కూచున్న చోటినుంచి కదల నివ్వలేదు.

ఎవరూ నోరు మెదపలేకపోతున్నారు. ఒక్కొక్కరి మనసులోనూ ఒక అపారమైన భావప్రపంచం, ఒకరినాలుకకీ మాట దొరకదు. ఆ మధురమైన మౌనంలో ముగ్గురిహృదయాలూ త్రివేణీ సంగమంలో కనబడకుండా కలిసిపోయే నదులలాగా లీనమైపోతున్నయ్. వారి ముగ్గురిప్రాణాలూ విడదీయలేని మూడు పాయలజడలాగా అల్లుకుపోతున్నయ్. ఆమౌనాన్ని ఎవరూ భంగం చెయ్యటానికి సాహసించటంలేదు. ఆమౌనం భంగంకావాలని ఎవరూ కోరటంలేదు. ఆమౌనంలో ఆనంత్యమే వచ్చి వారిమీద రెక్కలు విప్పినట్లనిపించింది. కిలకిలలాడుకుంటూ మేతకోసం ఎగిరిపోతున్న పిట్టల గుంపొకటి వాళ్ళముందుకి వచ్చి తుర్రున దూసుకుపోయి మబ్బుల్లో కలిసిపోయింది. వాటికికూడా వాళ్ళని మంత్రించిన మౌనాన్ని భంగం చెయ్యటానికి యిష్టలేకపోయింది కాబోలు!

---

కథా నిలయం
6020
శ్రీకాకుళం